ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు


SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 134 శనివారం 02 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజిలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 134 Saturday 02 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

# అంతిమంగా సామాన్యుడిపై భారం

- తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- వాణిజ్య సిలిండర్ ధరల పెంపు
- ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం
- అంతిమంగా సామాన్యుడిపై భారం పడుతుందని ఆందోళన
- హోటళ్లు, రెస్టారెంట్లు, వీధి వ్యాపారులకు ఆర్థిక భారమన్న మంత్రి
- ఎన్నికల తర్వాత ధరల పెంపు మోసం చేయడమేనని వ్యాఖ్య



**వార్త సంధ్య, హైదరాబాద్, మే 01 :**
కేంద్ర ప్రభుత్వం వాణిజ్య సిలిండర్ ధరలు పెంచడం వల్ల ఆ ప్రభావం అంతిమంగా సామాన్యుడిపై పడుతుందని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వాణిజ్య సిలిండర్ ధరను ఏకంగా రూ.993 పెంచారని, దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, కేఫ్‌లు, వీధి వ్యాపారులు, బేకరీలపై పెను భారం పడుతుందని అన్నారు. ఇది సామాన్యులకు ఆర్థిక భారమే అన్నారు.ఐదు రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచడమంటే ప్రజలను మోసం చేయడమేనని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే - మిగతా 2 లో

# టీఆర్ఎస్ గూటికి మాజీ మంత్రి బోడ జనార్దన్

- కవితతో భేటీ!
- కవిత పార్టీలోకి మొదలైన చేరికలు
- టీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్లు ప్రకటించిన జనార్దన్
- టీడీపీ నుంచి వరుసగా నాలుగు సార్లు గెలిచిన ఘనత
- బోడ జనార్దన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత అనుభవజ్ఞుడైన నాయకుడిగా పేరుగాంచారు



**వార్త సంధ్య, హైదరాబాద్, మే 01 :**
కవిత కొత్త పార్టీ టీఆర్ఎస్ లోకి చేరికలు మొదలయ్యాయి. సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి బోడ జనార్దన్ టీఆర్ఎస్ లో చేరనున్నారు.బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో కవితతో జనార్ధన్ భేటీ అయ్యారు. కవితతో భేటీ అనంతరం బోడ జనార్దన్ మాట్లాడుతూ, త్వరలోనే తన అనుచరవర్గంతో కలిసి అధికారికంగా పార్టీలో చేరతానని వెల్లడించారు. ముఖ్యంగా సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో టీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి, పార్టీ విస్తరణకు తన వంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.బోడ జనార్దన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత అనుభవజ్ఞుడైన నాయకుడిగా పేరుగాంచారు. మంచిర్యాల - మిగతా 2 లో


2 లో

# ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన మేడే గిఫ్ట్ ఇదే

- కేటీఆర్ చురక
- ఎన్నికలు పూర్తికాగానే పెట్రోల్, గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడం అలవాటుగా మారిందని విమర్శ
- రూపాయి పాతాళానికి పడిపోతుంటే, సిలిండర్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయన్న కేటీఆర్
- రాహుల్ గాంధీ ఆటో ఎక్కితే, ఆ డ్రైవర్ తన రెండు ఆటోలు అమ్ముకున్నాడని వ్యాఖ్య

# బెంగాల్‌లో నేడు 15 చోట్ల రీపోలింగ్

- పశ్చిమ బెంగాల్‌లోని 15 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్‌కు ఈసీ ఆదేశం
- ఎన్నికల అక్రమాలపై అందిన నివేదికలతో ఈ నిర్ణయం
- మగ్రాహాట్‌లో 11, డైమండ్ హార్బర్‌లో 4 బూత్‌లలో మళ్లీ పోలింగ్
- ఫల్టా నియోజకవర్గంలోనూ 30 బూత్‌లలో రీపోలింగ్ జరిగే అవకాశం
- ఈవీఎం బటన్‌పై వచ్చిన ఫిర్యాదుతో ప్రత్యేక పరిశీలకుడి విచారణ



**వార్త సంధ్య,పశ్చిమ బెంగాల్, మే 01 :**
పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఎన్నికల అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక నిర్ణయం తీసుకుంది. మగ్రాహట్ (పశ్చిమ్), డైమండ్ హార్బర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించాలని శుక్రవారం ఆదేశించింది. పోలింగ్ రోజున ఈ కేంద్రాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని రిటర్నింగ్ అధికారులు, జనరల్ అబ్జర్వర్లు ఇచ్చిన నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. రీపోలింగ్ జరగనున్న 15 బూత్‌లలో 11 మగ్రాహట్ (పశ్చిమ్) నియోజకవర్గంలో ఉండగా, మిగిలిన 4 డైమండ్ హార్బర్ పరిధిలో ఉన్నాయి.ఇదిలా ఉండగా, ఇదే జిల్లాలోని ఫల్టా అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా దాదాపు 30 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ జరిగే అవకాశం ఉందని - మిగతా 2 లో


2 లో

# ఈ ఒక్క ఏడాదే రూ.2 లక్షల కోట్ల కొత్త ఆస్తులు

- అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ సంచలన ప్రకటన
- ఈ ఏడాది కొత్తగా రూ.2 లక్షల కోట్ల విలువైన ఆస్తుల సమీకరణ
- 35 ఏళ్లలో సాధించిన వృద్ధిని ఈ ఒక్క ఏడాదే అందుకుంటామని వెల్లడి
- దేశ నిర్మాణంలో భాగంగా పలు కీలక ప్రాజెక్టులు చేపడుతున్నామని స్పష్టీకరణ

# అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను పట్టుకున్న ఎన్‌సీబీ

- ముంబయిలో రూ.1,745 కోట్ల కొకైన్ స్వాధీనం
- ముంబయిలో రూ.1,745కోట్ల 349కిలోల హై-గ్రేడ్ కొకైన్‌ను స్వాధీనం
- డ్రగ్స్ ముఠాలను నిర్దాక్షిణ్యంగా అణిచివేస్తామన్న అమిత్ షా
- సలీండోలాను భారత్‌కు తరలించిన కొన్నిరోజులకే భారీగా డ్రగ్స్ స్వాధీనం



**వార్త సంధ్య,ఢిల్లీ, మే 01 :**
అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను పట్టుకున్నట్లు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ముంబయిలో 1,745కోట్ల విలువైన 349కిలోల హై-గ్రేడ్ కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు అమిత్ షా ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. మాదకద్రవ్యాలను సరఫరా చేసే ముఠాలను నిర్దాక్షిణ్యంగా అణిచివేయాలని ప్రభుత్వం నిశ్చయించినట్లు చెప్పారు. ఎన్‌సీబీ ఓ చిన్న సరుకు ఆధారంగా వెళ్లి భారీ డ్రగ్స్ నెట్‌వర్క్‌ను ఛేదించటం 'బాటమ్-టు-టాప్' విధానానికి ఓ అద్భుత ఉదాహరణ అని అమిత్ షా పేర్కొన్నారు. దీనిని ఒక అంతర్జాతీయ డ్రగ్ కార్టెల్‌పై సాధించిన ఒక పెద్ద విజయంగా ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా ఎన్‌సీబీ బృందాన్ని అభినందించారు. దావూద్ ఇబ్రహీం ప్రధాన అనుచరుడు, డ్రగ్ ట్రాఫికర్ సలీం డోలాను తుర్కియే నుంచి భారత్‌కు తరలించిన కొన్నిరోజులకే భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది."మాదకద్రవ్యాల ముఠాను నిర్దాక్షిణ్యంగా అణచివేయడానికి నిశ్చయించుకున్నాం. ముంబయిలో రూ.1,745 కోట్ల విలువైన 349 కిలోల అత్యంత నాణ్యమైన కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నాం. ఫలితంగా ప్రధాన అంతర్జాతీయ మాదకద్రవ్యాల ముఠాపై నార్కోటిక్స్ బ్యూరో ఉక్కుపాదం మోపింది. ఇది బాటమ్ టు టాప్ విధానానికి ఒక ఉదాహరణ. ఈ విధానంలో ఏజెన్సీ ఒక చిన్న సరుకును గుర్తించి దాని ఆధారంగా ఒక భారీ నెట్‌వర్క్‌ను పట్టుకుంది. ఈ అద్భుతమైన విజయానికి ఎన్‌సీబీ బృందానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభినందనలు తెలిపారు.ఇదిలా ఉండగా మోస్ట్ వాంటెడ్ డ్రగ్ స్మగ్లర్, దావూద్ ఇబ్రహీం ప్రధాన అనుచరుడు మహ్మద్ సలీం డోలాను భారత్‌కు అప్పగించింది - మిగతా 2 లో



# ఏపీలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులకు కళ్లెం

- 80కిలోమీటర్లు దాటితే అడ్డంగా దొరికిపోతారు!
- ఏపీలో ప్రైవేట్ బస్సుల ప్రమాదాలపై ప్రభుత్వం సీరియస్
- ట్రావెల్స్ బస్సులకు గంటకు 80 కిలోమీటర్ల వేగ పరిమితి
- జీపీఎస్ ద్వారా బస్సుల వేగాన్ని పర్యవేక్షిస్తున్న రవాణా శాఖ
- నిబంధనలు అతిక్రమించి అతివేగంగా వెళ్తే బస్సులను సీజ్ చేస్తున్న అధికారులు
- అధికారుల చర్యలతో ట్రాక్‌లోకి వస్తున్న ట్రావెల్స్ యాజమాన్యాలు

**వార్త సంధ్య, అమరావతి, మే 01 :**
ఏపీలో ఇటీవల జరిగిన వరుస ప్రైవేట్ బస్సు ప్రమాదాలు తీవ్ర విషాదాన్ని నింపిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రవాణా శాఖ అధికారులు రంగంలోకి దిగారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల అతివేగానికి కళ్లెం - మిగతా 2 లో


2 లో

# విశాఖ ఉక్కుకు మరో భారీ ఊరట

- రూ. 8,097 కోట్ల అదనపు ప్యాకేజీకి కేంద్రం సిద్ధం!
- ఇప్పటికే తొలి దశలో రూ. 11,440 కోట్ల ప్యాకేజీ అందించిన కేంద్రం
- రెండో దశ ప్యాకేజీ ఫైల్ ను ఇప్పటికే క్లియర్ చేసిన కుమారస్వామి
- విశాఖ ప్లాంట్ లో గణనీయంగా పెరిగిన ఉత్పత్తి, అమ్మకాలు

# ఎన్నికల హామీ మేరకు విద్యుత్ ఛార్జీల తగ్గింపు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- మేడే కార్యక్రమం వేదికగా వైసీపీపై సీఎం తీవ్ర విమర్శలు
- వైసీపీ అధినేతకు మానసిక సమస్య ఉంది
- అది వైసీపీ కాదు గొడ్డలి పార్టీ అని ఎద్దేవా
- పవన్, లోకేష్‌ల పనితీరుపై సీఎం ప్రశంసలు
- ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజల నుంచే నివేదికలు స్వీకరిస్తామని ప్రకటన



**వార్త సంధ్య, అమరావతి, మే 01 :**
అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా కృష్ణా జిల్లా పమిడిముక్కలలో ఏర్పాటు చేసిన 'ప్రజా వేదిక' సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వైసీపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఉన్నది వైసీపీ కాదని, అదో గొడ్డలి పార్టీ అని సంచలన వ్యాఖ్యలు చేశారు. నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులు రాజకీయాలకు పనికిరారని, వైసీపీ అధినేతకు మానసిక సమస్యలు ఉన్నాయని తీవ్రంగా విమర్శించారు. తాము ప్రజాధనంతో నిర్మించిన ప్రజావేదికను రెండు గంటల్లో కూల్చివేయడమే వారి విధ్వంసకర మనస్తత్వానికి నిదర్శనమని ఆరోపించారు. తాము రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే, ఆ పార్టీ అధికారంలోకి వచ్చి విధ్వంసం సృష్టించిందని మండిపడ్డారు.గడచిన 22 నెలలుగా తమ కూటమి ప్రభుత్వం.. గత పాలనలో ధ్వంసమైన వ్యవస్థలను పునర్నిర్మిస్తూ ఏపీకి పునర్వైభవం తెచ్చేందుకు కృషి చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తున్నామని, భవిష్యత్తులో ఎట్టి పరిస్థితుల్లోనూ ఛార్జీలు పెంచబోమని మరోసారి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ప్రజలపై ఏకంగా 9 సార్లు విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపిందని - మిగతా 2 లో

# సంపాదకీయం

## నరకం...



భారతదేశాన్ని డోనాల్డ్ ట్రంప్ నరకంతో పోల్చిన కొద్దిరోజుల్లోనే అమెరికా పెద్దలందరికీ ఆ సాయుధుడు ప్రత్యక్ష నరకం అంటే ఏమిటో చూపించాడు. వైట్‌హౌస్ కరస్పాండెంట్ల విందు ఘటనలో అధ్యక్ష ఉపాధ్యక్షులు, మంత్రులు, అధికారులు క్షేమంగా బయటపడటం సంతోషం కలిగిస్తోంది. యావత్ ప్రపంచాన్ని నిర్ఘాంత పరిచిన ఈ పరిణామానికి కారకుడు ట్రంప్ పరిభాషలో చెప్పుకోవాలంటే స్వర్గంలాంటి తమ దేశాన్ని నరకప్రాయం చేయడానికి అక్రమంగా సరిహద్దులు దాటివచ్చిన చొరబాటుదారుడేమీ కాడు. చక్కగా చదువుకొని, ఇంజనీరింగ్ పూర్తిచేసి, పలు పరిశోధనలు ప్రయోగాలు నిర్వహించి, ప్రస్తుతం ఉపాధ్యాయవృత్తిలో ఉన్న ముప్పైయేళ్ళ ఈ అమెరికన్‌ని, కమలా హారిస్ ఎన్నికల ప్రచారానికి ఓ పాతిక డాలర్లు విరాళంగా ఇచ్చినందువల్ల డెమోక్రాటిక్ పార్టీ సానుభూతిపరుడని అంటున్నారు.రెండేళ్ళలో ట్రంప్ మీద జరిగిన మూడవ హత్యాయత్నం ఇది. ఒక ఫైవ్‌స్టార్ హోటల్‌లో అమెరికా అధ్యక్ష ఉపాధ్యక్షులు పాల్గొంటున్న కార్యక్రమంలోకి ఒక సాయుధ దుండగుడు వసతి సైతం సంపాదించి లోపలకు రాగలగడం భద్రతావ్యవస్థ వైఫల్యం. కాల్పులు జరిగిన వెంటనే ట్రంప్, వాన్స్‌లను భద్రతా సిబ్బంది ఈడ్చుకెళ్ళినంత పనిచేశారు. తాను హీరోలాగా ప్రవర్తించానని, ఎవరికీ భయపడనని, ఈ పదవిలో ఉన్న ముప్పుగురించి తనకు తెలుసునని, ఘటన అనంతరం కూడా హోటల్‌లోనే భోజనం చేసి వెళతానని తాను భీకరంగా పోరాడానని ట్రంప్ తన రాజకీయ అవసరాల రీత్యా చాలా చెప్పుకున్నారు. అయినా, చివరకు సీక్రెట్ సర్వీసెస్ చెప్పినట్లుగానే చేశానన్నది ఆ వ్యాఖ్యల సారాంశం. రేటింగులు తీవ్రంగా పడిపోయిన తరుణంలో ఈ దాడి జరగడం ఆయనకు రాజకీయంగా మేలు చేస్తుంది. అరవైరోజుల ఇరాన్ యుద్ధంలో అరవైసార్లు మాటమార్చి, అర్థంలేని నిర్ణయాలతో ప్రపంచాన్నంతా ముంచిన ట్రంప్‌కు నవంబరు మధ్యంతర ఎన్నికల్లో ఈ దాడి ఉపకరించవచ్చు. కాలువెనక్కుతీసుకోలేక మిత్రదేశాలను ఆడిపోసుకుంటూ కాలంనెట్టుకొస్తున్న ట్రంప్‌ను అమెరికన్ కాంగ్రెస్‌లో బలాబలాలు తారుమారయ్యే పరిస్థితినుంచి బయటపడవేయవచ్చును. బుల్లెట్ దెబ్బకు రక్తమోడిన చెవి అధికారాన్ని చేరువచేసినట్టే ఈ ఘటన సైతం ఉపకరించవచ్చు.రిపబ్లికన్ అబ్రహాం లింకన్ నుంచి డెమోక్రాట్ జాన్ ఎఫ్ కెన్నడీ వరకూ నలుగురు అమెరికా అధ్యక్షులు అధికారంలో ఉండగా ప్రాణాలు కోల్పోయారు. ఇదే హోటల్‌లో నలభైఐదేళ్ళక్రితం రోనాల్డ్ రీగన్‌పై హత్యాయత్నం జరిగింది. అయితే, ఇటీవలికాలంలో అమెరికా సమాజంలో విద్వేషం, హింసాప్రవృత్తి మరింత హెచ్చి వరుస హత్యలు, హత్యాయత్నాలు జరుగుతున్నాయి. ప్రతీ వందమందికీ 120 తుపాకులున్న దేశంలో, ఆటోమేటిక్ రైఫిళ్ళతో సామూహిక హత్యాకాండలకు దిగడం ఎలాగూ ఉండగా, నాయకులను, రాజకీయ, సైద్ధాంతిక ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడం, ఆయా దేశాలు, జాతుల పట్ల తీవ్ర వివక్ష, వ్యతిరేకతలతో దాడులకు పాల్పడటం, చంపివేయడం బాగా పెరిగింది. దేశంలోకి వచ్చినవారంతా దొంగలు, దురాక్రమణదారులు అన్నతరహాలో ఇమ్మిగ్రేషన్ అధికారులే వ్యవహరిస్తున్నారు. ట్రంప్ విధానాలు, అమానవీయ వైఖరులు ఉమ్మడి భావనను పాతరేశాయి. తనకు రాజకీయంగా అనుకూలంగా లేని ప్రతీ సంస్థనూ, వ్యవస్థనూ ట్రంప్ అవమానించి, ప్రజల్లో వాటిపట్ల నమ్మకాన్ని తుంచేశారు. అమెరికాను ఉన్నతంగా నిలబెట్టే పేరిట సమాజాన్ని చీల్చేశారు. ఐదేళ్ళక్రితం ట్రంప్ ప్రోత్సాహం మేరకు ఆయన మనుషులే క్యాపిటల్ హిల్‌మీద అత్యంత హేయమైన దాడి జరిపి, అమెరికా పరువుతీశారు. ట్రంప్ రాకకు ముందు పాత్రికేయులనుంచి కమేడియన్ల వరకూ అన్ని రంగాలవారూ స్వేచ్ఛగా, నిర్భీతితో అమెరికా అధ్యక్షులపై, పాలనపై వెటకారాలూ విమర్శలూ చేసేవారు. కానీ, ట్రంప్ రాకతో పరిస్థితి మారిపోయింది. ఒక నియంత మాదిరిగా వ్యవహరిస్తూ రాజకీయాల్లోనూ సమాజంలోనూ చర్చకు, భిన్నాభిప్రాయానికి చోటులేని వాతావరణాన్ని సృష్టించారు. ఎదుటివారు చెప్పింది వినకపోగా, దుర్మార్గపు భాషలో అవమానించడం ఒక ఆనవాయితీగా మారిపోయింది. కాలిఫోర్నియా వాసి కోలో టామోస్ అలెన్ జరిపిన ఈ దాడి అమెరికా సమాజం ఎటువంటి వాతావరణాన్ని అనుభవిస్తున్నదో తెలియచెబుతోంది. అతడి ఉద్దేశాలు, లక్ష్యాలు ఏవైనప్పటికీ, విభజనవాదం, విషపూరిత ప్రసంగాలు, తుపాకీ సంస్కృతి ఒక ప్రమాదకరమైన కలయిక.

## ఎన్నికల హామీ మేరకు విద్యుత్ ఛార్జీల తగ్గింపు

మొదటిపేజీ తరువాయి – ఆయన గుర్తుచేశారు. తమ ప్రజా ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా పనిచేస్తోందని, ప్రజలిచ్చే సహకారమే తమకు పెద్ద శక్తి అని అన్నారు.కూటమి ప్రభుత్వంలో భాగస్వాముల పనితీరును సీఎం అభినందించారు. పంచాయతీరాజ్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మార్పులు తీసుకొచ్చారని, విద్యా వ్యవస్థలో మంత్రి నారా లోకేష్ సంస్కరణలు అమలు చేసి పదో తరగతిలో విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించేలా చేశారని ప్రశంసించారు. ఇక నుంచి ప్రతి సమావేశంలోనూ ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజల నుంచి నేరుగా సమాచారం తీసుకుంటానని కీలక ప్రకటన చేశారు. తాను టీమ్ లీడర్‌గా ఉన్నానని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని హితవు పలికారు.అంతకుముందు, ముఖ్యమంత్రి చేతుల మీదుగా అత్యుత్తమ సేవలు అందించిన కార్మికులకు, ఉత్తమ యాజమాన్యాలకు శ్రమశక్తి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఎంపీ బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

## బెంగాల్‌లో నేడు 15 చోట్ల రీపోలింగ్

మొదటిపేజీ తరువాయి – ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయ వర్గాలు సూచిస్తున్నాయి. ఫల్టాలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పేరు, గుర్తు పక్కన ఉన్న ఈవీఎం బటన్ పనిచేయడం లేదని వచ్చిన ఫిర్యాదులపై ఈసీఐ సమగ్ర విచారణకు ఆదేశించింది. ఈసీ నియమించిన ప్రత్యేక పరిశీలకుడు సుబ్రత్ గుప్తా స్వయంగా గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి, విచారణ జరిపారు. సుదీర్ఘ విచారణ అనంతరం, ఆయన ఫల్టాలోని 30 బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించాలని సిఫార్సు చేసినట్లు సమాచారం.గతంలో ఫల్టా నియోజకవర్గం మొత్తం రీపోలింగ్ జరపాలని బీజేపీ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 29న పోలింగ్ జరగడానికి ముందు నుంచే ఇక్కడ తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మద్దతుదారుల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పోలింగ్ రోజున కూడా అక్కడక్కడా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి.

## అంతిమంగా సామాన్యుడిపై భారం

మొదటిపేజీ తరువాయి – స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు ఈరోజు భారీగా పెరిగిన విషయం తెలిసిందే.

## టీఆర్ఎస్ గూటికి మాజీ మంత్రి బోడ జనార్దన్



మొదటిపేజీ తరువాయి – జిల్లాలోని చెన్నూరు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డు సృష్టించారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో కార్మిక శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది.

# ఏపీలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులకు కళ్లెం



మొదటిపేజీ తరువాయి - వేయడమే లక్ష్యంగా, జీపీఎస్ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టంగా అమలు చేస్తున్నారు. ఇకపై ఏ ట్రావెల్స్ బస్సు అయినా గంటకు 80 కిలోమీటర్ల వేగాన్ని మించి ప్రయాణించడానికి వీల్లేకుండా నిబంధనలను కఠినతరం చేశారు.రాష్ట్రంలో ఆలిండియా టూరిస్ట్ పర్మిట్ (ఏఐటీపీ) కింద సుమారు 1800 బస్సులు రిజిస్టర్ కాగా, ఇప్పటివరకు 1,660 బస్సులకు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అనుసంధానం చేశారు. ఈ టెక్నాలజీ ద్వారా ఏ బస్సు ఎక్కడ, ఎంత వేగంతో ప్రయాణిస్తుందో అధికారులు తమ కంట్రోల్ రూమ్ నుంచే పర్యవేక్షిస్తున్నారు. ఏదైనా బస్సు 80 కిలోమీటర్ల వేగ పరిమితిని ఉల్లంఘించినట్లు జీపీఎస్ ద్వారా నిర్ధారణ అయితే, అధికారులు తక్షణమే ఆ బస్సును సీజ్ చేస్తున్నారు. అనంతరం ఆ బస్సును ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌కు (ఏటీఎస్) తరలించి, దాని స్పీడ్ లిమిట్ పరికరం పనితీరును క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనలు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు.ఈ పర్యవేక్షణ కేవలం ఏపీ సరిహద్దులకే పరిమితం కాలేదు. ఉదాహరణకు విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సు తెలంగాణలో ప్రయాణిస్తున్నప్పటికీ, దాని వేగాన్ని ఏపీ రవాణా శాఖ అధికారులు ట్రాక్ చేస్తారు. గతంలో మోటారు వాహన చట్టం ప్రకారం బస్సుల్లో స్పీడ్ లిమిట్ పరికరాలు ఉన్నప్పటికీ, చాలా ట్రావెల్స్ యాజమాన్యాలు వాటిని పనిచేయకుండా చేసి అతివేగంతో బస్సులను నడిపేవారు. ఈ సమస్యను అధిగమించడానికే ప్రభుత్వం జీపీఎస్ ట్రాకింగ్‌ను తప్పనిసరి చేసింది.రవాణా శాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం బస్సుల కదలికలను గమనిస్తున్నారు. అధికారుల కఠిన వైఖరి, బస్సులను సీజ్ చేస్తుండటంతో ట్రావెల్స్ యాజమాన్యాలు నిబంధనలు పాటించడం మొదలుపెట్టాయి. దీంతో చాలా బస్సులు పరిమిత వేగంతోనే నడుస్తుండటంతో, రోడ్డు ప్రమాదాల నియంత్రణ సాధ్యమవుతుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# విశాఖ ఉక్కుకు మరో భారీ ఊరట



మొదటిపేజీ తరువాయి - ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కి, ప్రస్తుతం నిలకడగా కొనసాగుతున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రెండో విడత ఆర్థిక ప్యాకేజీని ప్రకటించనుంది. గత ఏడాది అందించిన రూ. 11,440 కోట్ల సాయానికి అదనంగా, ఇప్పుడు మరో రూ. 8,097 కోట్ల ఆర్థిక సాయం అందించేందుకు కేంద్ర ఉక్కు శాఖ రంగం సిద్ధం చేసింది.కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఈ ప్యాకేజీకి సంబంధించిన ఫైల్‌ను ఇప్పటికే క్లియర్ చేశారు. ఇప్పటికే ఈ ప్రతిపాదనను ఆర్థిక శాఖ ఆమోదం కోసం పంపించారు. ఆర్థిక శాఖలోని వ్యయ విభాగం దీనికి పచ్చజెండా ఊపిన వెంటనే, ఈ అంశం తుది ఆమోదం కోసం కేంద్ర మంత్రివర్గం ముందుకు వెళ్లనుంది. తొలి దశలో అందించిన సాయం తరహాలోనే, ఈ రూ. 8,097 కోట్లను కూడా ఈక్విటీ రూపంలోనే సమకూర్చాలని కేంద్రం నిర్ణయించింది. దీనివల్ల ప్లాంట్‌పై రుణ భారం పడకుండా, మూలధనం పెరుగుతుంది.ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిపిన సంప్రదింపులతో తొలి దశలో రూ. 11,440 కోట్ల ప్యాకేజీ అందింది. ఇందులో రూ. 10,300 కోట్లు ఈక్విటీగా, మిగిలిన రూ. 1,140 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ రుణాల రూపంలో అందాయి. ప్రస్తుతం విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు అందుబాటులోకి రావడంతో కార్యకలాపాలు ఊపందుకున్నాయి. ఉక్కు ఉత్పత్తి, అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. ఈ పురోగతి దీర్ఘకాలం పాటు కొనసాగాలంటే అదనపు నిధుల అవసరం ఉందని గుర్తించిన కేంద్రం, ఈ రెండో దశ ప్యాకేజీ ద్వారా ప్లాంట్‌ను పూర్తిస్థాయి లాభాల బాటలోకి తీసుకురావాలని భావిస్తోంది.

# ఈ ఒక్క ఏడాదే రూ.2 లక్షల కోట్ల కొత్త ఆస్తులు

మొదటిపేజీ తరువాయి - అదానీ గ్రూప్ తమ వ్యాపారాల్లో వేగవంతమైన వృద్ధిని కొనసాగిస్తూ ఈ ఒక్క సంవత్సరంలోనే కొత్తగా రూ.2 లక్షల కోట్ల విలువైన ఆస్తులను సమకూర్చుకోనున్నట్లు గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ సంచలన ప్రకటన చేశారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రూప్‌లోని 4 లక్షల మంది ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గడిచిన 35 ఏళ్లలో తాము సుమారు రూ.2 లక్షల కోట్ల ఆస్తులను నిర్మించామని, కానీ ఇప్పుడున్న తమ సామర్థ్యంతో ఈ ఒక్క ఏడాదిలోనే మరో రూ.2 లక్షల కోట్ల ఆస్తులను జోడించబోతున్నామని ఆయన ఉద్ఘాటించారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన 'వికసిత భారత్ 2047' లక్ష్య సాధనలో తమ వంతు పాత్ర పోషిస్తామని గౌతమ్ అదానీ స్పష్టం చేశారు. తాము చేపట్టే ప్రాజెక్టులు కేవలం పనులు పూర్తి చేయడం కాదని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడమేనని ఆయన అన్నారు. ముంద్రా పోర్టు, గంగా ఎక్స్‌ప్రెస్‌వే వంటి ప్రాజెక్టులను ఉదాహరణగా చూపుతూ, ఇవి దేశ నిర్మాణంలో కీలకమైనవని పేర్కొన్నారు.పలు కీలక ప్రాజెక్టుల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఒకప్పుడు బీడుభూమిగా ఉండి, ఇప్పుడు దేశంలోనే అతిపెద్దదైన ముంద్రా పోర్టు, కేరళలోని విళింజం పోర్టులు దేశ వాణిజ్యాన్ని, అంతర్జాతీయ సముద్ర వాణిజ్య పటంలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. కచ్‌లోని ఖవ్దాలో నిర్మిస్తున్న ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ఇంధనాన్ని అందిస్తుందన్నారు.అలాగే, నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం దేశానికే గర్వకారణంగా నిలుస్తుందని, ఇటీవల ప్రారంభమైన గంగా ఎక్స్‌ప్రెస్‌వే ఉత్తరప్రదేశ్‌లో 8 కోట్ల మంది ప్రజల జీవితాలను మార్చబోతోందని వివరించారు. మీరట్-ప్రయాగ్‌రాజ్ మధ్య ప్రయాణ సమయం 10-11 గంటల నుంచి 5-6 గంటలకు తగ్గుతుందని తెలిపారు. ముంబైలోని ధారవి మురికివాడల పునరాభివృద్ధి ప్రాజెక్టును కేవలం ఒక ప్రాజెక్టుగా కాకుండా, మానవ పరివర్తనలో ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత సవాలుతో కూడిన ప్రయత్నంగా ఆయన అభివర్ణించారు. దేశ నిర్మాణంలో భాగంగా తాము చేపడుతున్న ఈ ప్రాజెక్టులన్నీ తమ వంతు వినయపూర్వకమైన సేవ అని గౌతమ్ అదానీ పేర్కొన్నారు.

# అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను పట్టుకున్న ఎన్‌సీబీ



మొదటిపేజీ తరువాయి – తుర్కియే. ఇస్తాంబుల్ నుంచి అతడిని ప్రత్యేక విమానంలో దిల్లీకి తీసుకొచ్చారు. 'ఆపరేషన్ గ్లోబల్ హంట్' కింద అంతర్జాతీయ, భారత నిఘా సంస్థలతో సమన్వయంతో ఈ ఆపరేషన్ చేపట్టారు. భారత నిఘా ఏజెన్సీలు ఇచ్చిన సమాచారంతో తుర్కియే పోలీసులు శనివారం అతడిని అదుపులోకి తీసుకున్నాయి. గతంలోనే సలీం డోలాపై భారత్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. ప్రస్తుతం సలీంను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు విచారిస్తున్నారు. గతేడాది జూన్‌లో సలీమ్ డోలా కుమారుడు తాహెర్ యూఏఈలో పట్టుబడ్డాడు. తాహెర్‌ను కూడా యూఏఈ నుంచి భారత్‌కు తీసుకొచ్చి విచారించారు. ఈ క్రమంలోనే సలీమ్ డోలా ఆచూకీ లభించినట్లు సమాచారం. సలీం డోలాను విజయవంతంగా భారత్‌కు తీసుకురావడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులను ప్రశంసించారు. డ్రగ్స్ మాఫియా కింగ్‌పిన్‌లకు ప్రపంచంలో ఏ మూలనా రక్షణ దొరకదని అమిత్ షా హెచ్చరించారు.కాగా, రెండు రోజుల క్రితమే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో భారీగా డ్రగ్స్‌ను పట్టుకున్నారు. 11.4 కిలోల క్రిస్టల్‌మెత్‌ను స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ రూ.11.4 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. రైల్వేస్టేషన్‌లో డీఆర్ఐ అధికారులు తనిఖీలు చేపట్టగా, ట్రాలీ బ్యాగులతో అనుమానాస్పదంగా వస్తున్న ఇద్దరు మహిళలను గమనించారు. వారిని ఆపి తనిఖీలు చేపట్టగా బ్యాగుల్లో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. దీంతో ఇద్దరిని అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు శంషాబాద్ విమానాశ్రయంలో కూడా భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. ఎయిర్ ఆసియా విమానంలో బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి వద్ద 6.15 కిలోల హైడ్రోఫోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.2.15 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. 16 సీల్డ్ ప్యాకెట్లలో దీనిని తెస్తుండగా తనిఖీలు చేపట్టి అధికారులు పట్టుకున్నారు.

# ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన మేడే గిఫ్ట్ ఇదే




మొదటిపేజీ తరువాయి – ఎన్నికలు పూర్తికాగానే పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అలవాటుగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. 80 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా కమర్షియల్ సిలిండర్ గ్యాస్ ధరలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ మేడే కానుకగా హోటల్ కార్మికులకు ఇచ్చిన బహుమతి కమర్షియల్ గ్యాస్ ధరలు పెంచడమేనని ఎద్దేవా చేశారు. మోదీ పాలనలో రూపాయి పాతాళానికి పడిపోతుంటే, సిలిండర్ ధరలు ఆకాశాన్నంటు తున్నాయని మండిపడ్డారు.అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జెండాను కేటీఆర్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.కార్మికుల సంక్షేమం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. సిగాచీ పరిశ్రమలో కార్మికులు ప్రమాదంలో చనిపోతే వారికి ఇప్పటి వరకు పరిహారం అందలేదని అన్నారు. ఎన్నికలకు ముందు ఆయన దానవీర శూరకర్ణలా మాట్లాడారని, ఎన్నికలు అయ్యాక కుంభకర్ణుడిలా మారిపోయాడని వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేని పరిస్థితి ఉన్నప్పుడు జేమ్స్ బాండ్‌లా బాండు పేపర్లు ఎందుకు రాసిచ్చారని ప్రశ్నించారు.హామీల గురించి అడిగితే బూతులు తిడుతున్నారని ధ్వజమెత్తారు. తాను ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్ ఎలా ఎంతోమంది ముఖ్యమంత్రులను చూశానని, కానీ రేవంత్ రెడ్డి లాంటి సీఎంను చూడలేదని అన్నారు. రేవంత్ రెడ్డి ఎలాగూ మరోసారి ముఖ్యమంత్రి కాబోరని, కానీ ఉన్నన్నాళ్ళైనా నాలుగు మంచి పనులు చేస్తే బాగుంటుందని హితవు పలికారు. కార్మికులు అంటే రేవంత్ రెడ్డికి లెక్కలేదని అన్నారు.తాను కొన్ని కొన్ని నెలల క్రితం పార్టీ కార్యాలయం వద్ద కారు అందుబాటులో లేకపోవడంతో మస్రత్ అలీ అనే వ్యక్తి ఆటోను ఎక్కానని తెలిపారు. ఆ సమయంలో ఆయనతో మాట్లాడానని, ఆయన చెప్పిన విషయాల విని ఆందోళన చెందానని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే మస్రత్ అలీ ఆటోను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్కారని, ఆ సమయంలో అతనికి రెండు ఆటోలు ఉండేవని చెప్పారు. రాహుల్ గాంధీ ఎక్కిన తర్వాత ఆయన తన ఆటోలను అమ్మేసుకుని కిరాయి ఆటో నడుపుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కొందరి అడుగు అలా ఉంటుందని రాహుల్ గాంధీని ఉద్దేశించి అన్నారు.

# నేడు అమరావతిలో మొబైల్ ఫోన్లకు ఈ సందేశం వస్తే కంగారు పడకండి!

**ఏపీ రాజధాని ప్రాంతాల్లో శనివారం ఎమర్జెన్సీ అలర్ట్ సిస్టమ్ టెస్టింగ్**

**ఉదయం 11:15 నుంచి 12:15 గంటల మధ్య మొబైల్స్‌కు పరీక్షా సందేశాలు**

**జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో ఈ ట్రయల్ రన్**

**ఇది కేవలం పరీక్షేనని, ప్రజలు ఆందోళన చెందవద్దని అధికారుల సూచన**

**విపత్తుల సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడమే ఈ వ్యవస్థ లక్ష్యం**



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలోని మొబైల్ వినియోగదారులకు రేపు (మే 2 శనివారం) ఒక ప్రత్యేక హెచ్చరిక సందేశం రానుంది. పెద్ద బీప్ సౌండ్‌తో కూడిన ఈ సందేశం చూసి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది కేవలం ప్రయోగాత్మకంగా పరీక్షించడంలో భాగమేనని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా అత్యవసర హెచ్చరికల వ్యవస్థను బలోపేతం చేసేందుకు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్డీఎంఏ) ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వెల్లడించింది.వివరాల్లోకి వెళితే, శనివారం ఉదయం 11:15 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల మధ్యలో ఏపీ రాజధాని ప్రాంతాల్లోని అన్ని మొబైల్ ఫోన్లకు సెల్ బ్రాడ్‌కాస్ట్ టెక్నాలజీ ద్వారా ఒక టెస్ట్ మెసేజ్ పంపనున్నారు. విపత్తుల సమయంలో ప్రజలను తక్షణమే అప్రమత్తం చేసేందుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశారు. "అప్రమత్తమైన పౌరులు, సురక్షితమైన దేశం" అనే నినాదంతో ఈ వ్యవస్థ పని చేస్తుంది."ఇది భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ విభాగం ద్వారా పంపబడిన నమూనా పరీక్ష సందేశం. దయచేసి ఈ సందేశాన్ని విస్మరించండి. మీ వైపు నుంచి ఎటువంటి చర్య అవసరం లేదు" అనే సమాచారంతో ఈ ఫ్లాష్ మెసేజ్ మొబైల్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఈ పరీక్ష ద్వారా నెట్‌వర్క్ సామర్థ్యాన్ని, హెచ్చరికలు చేరే వేగాన్ని అధికారులు అంచనా వేస్తారు. భవిష్యత్తులో తుపానులు, భూకంపాలు, వరదలు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు తక్షణ సమాచారం అందించేందుకు ఈ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడనుంది.

# కార్మిక సంక్షేమ పథకాలపై అవగాహన పెరగాలి

**అదనపు కలెక్టర్ డి.వేణు**

**శ్రామిక హక్కులు పోరాటాల ఫలితం**

**కనీస వేతనాల చట్టం అమలుకార్మికులకు**

**అన్యాయం జరగకుండా చర్యలు**

**సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన**

**మే డే వేడుకల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్**




**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 01( వార్త సంధ్య) :** కార్మిక సంక్షేమ పథకాలపై అవగాహన పెరగాలని అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు. శుక్రవారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ



మందిరంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ డి.వేణు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి. వేణు మాట్లాడుతూ మే డే సందర్భంగా అన్ని ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి శాఖలో పనిచేసే ఉద్యోగులందరూ శ్రామికులేనని, మనందరం శ్రమజీవులమేనని పేర్కొన్నారు.శ్రామిక హక్కులు, ప్రయోజనాలు పోరాటాల ద్వారానే సాధ్యమయ్యాయని తెలిపారు. 1886లో చికాగోలో జరిగిన ఉద్యమాల అనంతరం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం ఏర్పడిందని చెప్పారు. భారతదేశంలో 1923 నుండి మే డే వేడుకలు నిర్వహిస్తున్నామని వివరించారు. జిల్లాలోని శ్రామిక సంఘాలకు కార్మిక శాఖ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై మరింత అవగాహన కల్పించాలని కోరారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కార్మికులకు కూడా ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా చూడాలని సూచించారు.కనీస వేతనాల చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని, జిల్లాలోని సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌టీపీసీ, కేశోరం వంటి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఎలాంటి అన్యా యం జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమం అనంతరం మే డే పురస్కారాలను కార్మికులకు అంద జేశారు.ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ వెంకటరమణ, జిల్లా సహాయ కార్మిక అధికారి మొహమ్మద్ రఫీ, జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి,సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## పిఆర్సి పెంపుతో ఆర్టీసీ కార్మికుల్లో ఉత్సాహం

**ఇల్లందులో ఘనంగా సంబరాలు**

**ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం**

**శంకర్ గౌడ్ కు నివాళి**

**కార్మిక దినోత్సవం సందర్బంగా ప్రత్యేక కార్యక్రమం**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 01 (వార్త సంధ్య) :** ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన పిఆర్సి పెంపు పై ఇల్లందు డిపోలో కార్మికులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కార్మికులతో కలిసి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ గతంలో ఆర్టీసీ కార్మికులు 51 రోజులు సమ్మె చేసినా పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం మాత్రం రెండు రోజుల్లోనే సమస్యలను పరిష్కరించిందని తెలిపారు. కార్మికులు, కర్షకులు, బడుగు బలహీన వర్గాలకు సమన్యాయం చేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల కోసం ప్రాణత్యాగం చేసిన శంకర్ గౌడ్ ని స్మరించుకుంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నివాళి ఘటించారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, రవాణా శాఖ మంత్రి తీసుకున్న చర్యలను ఎమ్మెల్యే అభినందిస్తూ, ఇల్లందు డిపో తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, పురపాలక చైర్మన్ దొడ్డా కిరణ్ మిత్ర డానియేల్, మాజీ చైర్మెన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు, జిల్లా నేతలు మరియు ఆర్టీసీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏఐటియుసి ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు

**ఉత్తమ కార్మికులకు సన్మానం - శ్రమశక్తి అవార్డులు బహుకరణ**





**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 01 (వార్త సంధ్య) :** కొత్తగూడెం ఏరియాలోని అన్ని మైన్స్ మరియు డిపార్ట్మెంట్స్ లో శుక్రవారం ఉదయం 141వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి వి.మల్లికార్జున్ రావు మాట్లాడుతూ ముందుగా కార్మికులకు హృదయపూర్వక మే డే శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 44 లేబర్ చట్టాలను 4 కోడ్లుగా విభజించి కార్మిక హక్కులను హరించే విధానాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్నదని విమర్శించారు. అలాగే 1886లో అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పనిదినం కోసం కార్మికులు చేసిన చారిత్రాత్మక పోరాటాన్ని, వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఆ కార్మికుల రక్త తర్పణంతో ఎగిరిన ఎర్రజెండా ప్రపంచ కార్మిక వర్గానికి స్ఫూర్తిగా నిలిచిందని తెలిపారు. కార్మిక హక్కులను హరించాలని చూస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగట్టే విధంగా ఎఐటియుసి యూనియన్ ఇచ్చే పిలుపుకు కార్మికులంతా ఏకమవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఆర్‌సిహెచ్‌పి, సివిల్ మరియు పివికే-5 గనులలో ఎఐటియుసి ఆధ్వర్యంలో ఉత్తమ కార్మికులను ఎంపిక చేసి వారిని సన్మానించి "శ్రమశక్తి అవార్డు"లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, సహాయ కార్యదర్శి గట్టయ్య, వైస్ ప్రెసిడెంట్ కత్తెర్ల రాములు, ఆఫీస్ బ్యారర్స్ సందబోయిన శ్రీనివాస్, ఎస్. నాగేశ్వరరావు, గుమ్మడి వీరయ్య,పిట్ కార్యదర్శులు భూక్యా రమేష్, మధుకృష్ణ, ఏం ఆర్ కే ప్రసాద్,కమల్, సీనియర్ నాయకులు సురేందర్, సాయి పవన్, మురళి, బండి వెంకటరమణ, కొవ్వూరి రాజేశ్వరరావు,గంగారం,మెంగెన్ రవి ,కోటి,జోసెఫ్,ఏసుపదం,మండల రాజేశ్వరరావు, రమేష్, స్వదీప్, దేవసింగ్,ఇరప కృష్ణ, మహేందర్, రామచందర్, అవినాష్, వినయ్, సాగర్, అప్పారావు, కరుణాకర్,భాను ప్రసాద్, కోటయ్య ,అంకం రవి,తదితరులు పాల్గొన్నారు.

**అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో**

## మేడే (కార్మిక దినోత్సవం) జరిగింది




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 1 :** సందర్భంగా గోగుల స్వామి ఆధ్వర్యంలో జాతీయ యోజన అధ్యక్షులు శ్రీ డాక్టర్ వేముల లోకేష్ ఆదేశాలతో సికింద్రాబాద్ తుకారాం గేట్ సుభాష్ చంద్రబోస్ స్టాటు దగ్గర పండ్లు మజ్జిగలు పంపిణీ చేశారు కష్టాన్ని నమ్ముకున్నవాడే అసలైన విజేత. లోకానికి వెలుగు నిచ్చే కార్మిక శక్తికి వందనం. అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన జాతీయ యువజన అధ్యక్షులు డాక్టర్ వేముల లోకేష్లి జాతీయ సెక్రెటరీ మక్కల శేఖర్ జాతీయ ఆర్గనైజర్ సెక్రటరీ లివర్కు ప్పల శ్రీనివాస్ శ్రీకాంత్ శివలింగం వీరేశం

## నేడు జాయింట్ పి ఎ ఓ, అంజనీ దేవి మొహమ్మద్ ఘౌస్ గరి, పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే. 1 :** ఇ కార్యక్రమం ముఖ్య అతిథి గా పి ఎ ఓ హను మంతు టి ఎన్జీవో నగర శాఖ అధ్యక్షుడు కట్కూరి శ్రీకాంత్ పా అసోసియేషన్ అధ్యక్షురాలు శ్రీలక్ష్మి , టి జి ఓ అధ్యక్షుడు వెంకటేశం టిఎన్‌జిఓ పి ఎ ఓ యూనిట్ అధ్యక్షుడు బి సంతోష్ , పి ఎ ఓ అసోసియేషన్ కార్యదర్శి సత్యనారాయణ , టి జి ఓ కార్యదర్శి కృష్ణయ్య , టిఎన్‌జిఓ కార్యదర్శి బాలనర్సింగ్ , టిఎన్‌జిఓ కోశాధికారి ఆదిత్య పాల్గొనడం జరిగింది

## మేడే సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు





**మంథని, మే 01( వార్త సంధ్య) :** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కార్మిక సోదరి, సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం మంథని పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద నిర్వహించిన మేడే వేడుకల్లో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని, ముఖ్యంగా మున్సిపల్ కార్మికులు పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతూ అభివృద్ధికి విశేషంగా తోడ్పడుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు.అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ సమాజ పురోగతికి కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మంథని పట్టణంలో పనిచేస్తున్న కార్మికుల్లో ఇల్లు లేని వారికి గుర్తింపు ఇచ్చి,వారికి ఇందిరమ్మ ఇళ్లను అందించే ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయంధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## కార్మికులను ఘనంగా సన్మానించిన కౌన్సిలర్

## మున్సిపల్ కార్మికుల సేవలు అమోఘం శ్రీలత క్రాంతి



**మంథని, మే 01(వార్త సంధ్య) :** ప్రపంచ మే డే జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం బోయిన్ పేట్ 6వ వార్డ్ కౌన్సిలర్ పోతరవేణి శ్రీలత క్రాంతి కుమార్ కార్మికులను ఘనంగా సన్మానించారు. ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ బోయిన్ పేట్ అభివృద్ధికి తోడందిస్తున్న కార్మిక సోదరులను సన్మానించడం మన సంప్రదాయమని కౌన్సిలర్ శ్రీలత తెలిపారు. వారి సేవలకు గుర్తింపుగా షీల్డ్ లను అందజేసి ఆమె వారికి మే డే శుభాకాంక్షలు తెలిపారు. ఎదుటి వారి కష్టాన్ని దోచుకుంటున్నా ఈ కలికాలంలో కూడా కల్మషం లేకుండా నిరంతరం సేవలందిస్తున్నారని ఆమె గుర్తు చేశారు.

## కార్మికుల కృషి దేశానికి శక్తి

## గుంజపడుగు సర్పంచ్ దండవేన సంధ్య బానేష్



**మంథని, మే 01(వార్త సంధ్య) :** మంథని మండలం గుంజపడుగు గ్రామంలో దండేవేన సంధ్య బానేష్ శుక్రవారం మే డే సందర్భంగా ఉపాధి హామీ కూలీల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కార్మికుల కృషి దేశానికి శక్తి అని,కార్మికుల హక్కులు శ్రమకు గౌరవం ఇవ్వడానికి, పని వేళలు వేతనాలు పని పరిస్థితులు మెరుగుపరచడానికి జరిగిన పోరాటాలను గుర్తు చేసుకోవడానికి మేడే జరుపుకుంటామన్నారు. 1886లో చికాగోలో కార్మికులు రోజుకు 8 గంటల పని కోసం సమ్మె చేసిన సందర్భాన్ని ఆమె గుర్తు చేశారు. ఆ సందర్భంగా జరిగిన సంఘటనలో చాలామంది కార్మికులు గాయపడ్డారు మరి కొంతమంది మరణించారన్నారు. ఆ సంఘటన కార్మిక ఉద్యమానికి ప్రతికగా నిలిచిందని, మే డే అనేది కార్మికుల కృషిని గౌరవించే దినమని సమాన హక్కుల కోసం జరిగిన పోరాటాన్ని గుర్తుచేసే ముఖ్యమైన రోజు అని సర్పంచ్ సంధ్య బానేష్ తెలిపారు.

## మే డే సందర్భంగా జెండాను ఆవిష్కరించిన ఆర్టీసీ కార్మికులు



**మంథని, మే 01(వార్త సంధ్య) :** 140 వ మే డే దినోత్సవాన్ని పురస్కరించుకొని మంథని బస్ డిపో వద్ద (ఎస్ డబ్ల్యూ ఎఫ్ )డీపో సహాయ కార్యదర్శి వై.శ్రీకాంత్ రెడ్డి శుక్రవారం మే డే జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కార్యదర్శి రాపెల్లి రాజయ్య మాట్లాడుతూ ఆనాడు పారిశ్రామిక విప్లవం తరువాత పెరిగిన శ్రమ దోపిడీకి నిరసనగా ఎనిమిది గంటల పని కోసం పోరాడారని, ఆ పోరాటంలో నలుగురు కార్మికులు మొట్టమొదటిసారిగా నెలకొరిగారని, వారి త్యాగాలకు గుర్తుగానే ప్రతి సంవత్సరం మే డే జరుపుకుంటున్నామని తెలిపారు. మళ్ళీ 200 ఏళ్ళ తర్వాత కూడా పని పరిస్థితులు నానాటికి దిగజారి పోతున్నాయని, పని గంటల పెంపు యదేచ్ఛగా కొనసాగుతుందని, ఇటీవల నోయిడాలో కార్మికులు కనీస వేతనాలు, ఎనిమిది గంటల పని కోసం పోరాడితే 480 మందిని జైల్లో పెట్టారని ఆయన అన్నారు. కావున మే డే స్ఫూర్తితో కార్మికులంతా ఎనిమిది గంటల పనిని కాపాడుకోవాలని, అందుకోసం పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆయన కోరారు. కార్మికులంతా సంఘాల కతీతంగా, ఐక్యంగా పోరాటం వల్లే, ఆర్టీసీ సమ్మె విజయవంతమైనదని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ మంథని కమిటీ గౌరవ అధ్యక్షులు బూడిద గణేష్ ,గ్రామపంచాయతీ కార్మికులు, ఆర్టీసీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వృద్ధురాలి పై కోతుల దాడి..

**తీవ్ర గాయాలు ఆస్పత్రికి తరలింపు**

**కోతులు, అల్లరి కుక్కల బెడద పై ప్రజల ఆందోళన**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 01 (వార్త సంధ్య) :** కొత్తగూడెం పట్టణంలోని రామవరం ప్రాంతంలో కోతుల దాడి కలకలం రేపింది. గిర్ధారిలాల్ టెక్స్టైల్స్ షోరూమ్ వెనుక లైన్‌లో నివసిస్తున్న పోచమ్మ అనే వృద్ధురాలిపై కోతులు దాడి చేసి కరిచి గాయపరిచాయి. స్థానికులు వెంటనే స్పందించి ఆమెను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. గత కొంతకాలంగా కోతుల బెడద పెరుగుతోందని, ఇళ్లలోకి చొరబడి ఆహారం దోచుకోవడం, రోడ్లపై వెళ్తున్న వారిపై దాడులు చేయడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అదేవిధంగా పట్టణంలో అల్లరి కుక్కల సమస్య కూడా రోజురోజుకీ తీవ్రమవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావడానికి కూడా భయపడే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కొత్తగూడెం కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి కోతులు, అల్లరి కుక్కలను నియంత్రించే చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ప్రజల భద్రత కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మంథనిలో ఘనంగా మే డే వేడుకలు

**ముఖ్యఅతిథిగా హాజరైన ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**మే డే స్ఫూర్తి తో కార్మిక సంక్షేమం కోసం కృషి చేస్తాం**

**మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలను ఉధృతం చేస్తాం**

**సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్**




**మంథని, మే 01(వార్త సంధ్య) :** మంథనిలో సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐటి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అర్హులైన మున్సిపల్ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని,ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తామని,జీతాల పెంపుదల కోసం కృషి చేస్తామని,ఎన్ఎంఆర్ కార్మికులం కాంటాక్ట్ పరిధిలోకి తీసుకురావడానికి కృషి చేస్తానని,కార్మికుల సంక్షేమం కోసం మే డే స్ఫూర్తితో పని చేస్తామని అన్నారు. అనంతరం సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ చికాగో అమరవీరుల స్ఫూర్తితో వచ్చిన 8 గంటల పని దినాలకు కేంద్ర బిజెపి ప్రభుత్వం మంగళం పాడుతూ కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కి కార్మికులకు శాపంగా మారిన నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని అన్నారు. కార్మికులు 12 గంటలు పనిచేయాలని బానిస వెట్టి చాకిరి వ్యవస్థలోకి నెట్టేసి ప్రయత్నం బిజెపి ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. మే డే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమాలను బలోపేతం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వేల్పుల సురేష్, చింతల గోవింద్, మల్లేష్,చందు, గట్టయ్య,జంపయ్య,పోచమ్మ, భాగ్య,సుక్కమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మే 6న మెగా జాబ్ డ్రైవ్ నిర్వహణ

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**సుమారుగా 68 సంస్థలతో 3439 ఉద్యోగ అవకాశాలు లభ్యం**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,మే 01 (వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లా యువతకు ఉపాధి అవకాశాలను మరింత విస్తరించేందుకు జిల్లా పరిపాలన యంత్రాంగం, టాస్క్ మరియు డీట్ సంయుక్తంగా మే 6న వెంకట పద్మ ఏ /సి ఫంక్షన్ హాల్, ఆర్టీఒ ఆఫీస్ ఎదురుగా, పెద్దపల్లిలో మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్‌లో సుమారుగా 68 సంస్థలు పాల్గొంటుండగా, సుమారు 3439 ఉద్యోగ అవకాశాలు లభ్యమవుతున్నాయని తెలిపారు. టెలికాం & కమ్యూనికేషన్, కస్టమర్ సపోర్ట్ & బీపీవో , సేల్స్ & మార్కెటింగ్, డిజిటల్ సర్వీసెస్, ఫీల్డ్ ఆపరేషన్స్ వంటి విభిన్న రంగాల్లో ఈ అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని యువతను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సిద్ధం చేయడం,వారికి నేరుగా ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. టాస్క్ మరియు డీట్ ద్వారా ఇప్పటికే శిక్షణ పొందిన పలువురు యువత ఈ తరహా జాబ్ డ్రైవ్‌ల ద్వారా ఉద్యోగాలు సాధించి మంచి స్థాయికి చేరుకున్న విషయం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఎస్సి ,ఇంటర్,ఐటిఐ , డిప్లొమా,డిగ్రీ,ఫార్మసీ, ఇంజనీరింగ్,ఎంబీఏ తదితర అర్హత కలిగిన ప్రతి యువకుడు,యువతి ఈ మెగా జాబ్ డ్రైవ్‌ను ఒక మంచి అవకాశంగా తీసుకుని తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. అభ్యర్థులు తమ రెజ్యూమ్‌లతో హాజరుకావడంతో పాటు, డీట్ పోర్టల్‌లో నమోదు చేసుకుని అప్లై చేయాలని సూచించారు. జిల్లా యువత ఉపాధి పొందడం ద్వారా వారి కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా,జిల్లా సమగ్ర అభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు.ఈ దిశగా జిల్లా పరిపాలన యంత్రాంగం పూర్తి మద్దతు అందిస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## బోదనేతర సిబ్బంది బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

**జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 01(వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న బోదనేతర సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం మరియు డైరెక్టర్,పాఠశాలల విద్య, తెలంగాణ,హైదరాబాద్ ఉత్తర్వుల మేరకు బదిలీల ప్రక్రియ చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.దసిబ్బంది సర్వీస్ వివరాలు,ఖాళీల జాబితాను సంబంధిత పాఠశాలల ప్రధానో పాధ్యాయు లకు పంపించినట్లు ఆమె పేర్కొన్నారు. పాఠశాలల ప్రధానో పాధ్యాయులకు పంపిన వివరాలను పరిశీ లించుకుని ,నాలుగు సంవత్సరాలు పూర్తి చేసి తప్పనిసరి బదిలీకి అర్హులైన సిబ్బంది నిర్ణీత షెడ్యూల్ ప్రకారం మే 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే అభ్యర్థులు మే 8వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రత్యేక కేటగిరీకి చెందిన సిబ్బంది సంబంధిత ధృవపత్రాలను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం,పెద్దపల్లిలో సమర్పించాలని ఆమె కోరారు. కావున జిల్లాలోని బోదనేతర సిబ్బంది అందరూ నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ,బదిలీ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద సూచించారు.

## మత్స్యకారులందరూ మే 23లోపు ఎన్ఎఫ్‌డీపీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

**జిల్లా మత్స్యశాఖాధికారి పి.నరేష్ కుమార్ నాయుడు**

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 01( వార్త సంధ్య) :** జిల్లాలో గల మత్స్య సహకార సంఘాలలో సభ్యత్వం పొందిన మత్స్యకార సభ్యులందరూ తప్పనిసరిగా 23-05-2026 లోగా ఎన్ఎఫ్‌డీపీ (నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్‌ఫాం) పోర్టల్‌లో తమ పేరును నమోదు చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖాధికారి పి. నరేష్ కుమార్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం ద్వారా మత్స్యశాఖకు సంబంధించిన అన్ని పథకాల లబ్ధి పొందేందుకు ఎన్ఎఫ్‌డీపీ పోర్టల్‌లో నమోదు చేసుకున్నవారే అర్హులవుతారని ఆయన పేర్కొన్నారు.గడువులోగా నమోదు చేయించుకోని సభ్యులకు గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ (జిఏఐఎస్) పథకం వర్తించదని స్పష్టం చేశారు.కాబట్టి జిల్లాలోని ప్రతి మత్స్యకార సభ్యుడు నిర్దిష్ట గడువులోగా ఎన్ఎఫ్‌డీపీ పోర్టల్‌లో నమోదు చేసుకుని, మత్స్యశాఖ చేపట్టే పథకాలతో పాటు గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ (జిఏఐఎస్) పథకం ద్వారా లబ్ధి పొందాలని జిల్లా మత్స్యశాఖాధికారి ప్రకటనలో కోరారు.

## కార్పొరేట్ ఏరియాలో మేడే వేడుకలు ఘనంగా

**ఎఐటియుసి పిలుపుతో కార్మికుల్లో ఐక్యత**

**141వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం నిర్వహణ**

**కేంద్ర కార్మిక విధానాలపై విమర్శలు**

**చికాగో పోరాట స్ఫూర్తిని స్మరించిన నేతలు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 01 (వార్త సంధ్య) :** కార్పొరేట్ ఏరియాలోని అన్ని విభాగాల్లో 141వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని ఎఐటియుసి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గుర్తింపు కార్మిక సంఘంగా ఎఐటియుసి పతాక ఆవిష్కరణతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఐటియుసి ముఖ్య సలహాదారు శేషయ్య, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ మాట్లాడుతూ కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఆందోళన వ్యక్తం చేశారు. 44 లేబర్ చట్టాలను 4 కోడ్లుగా విభజించడం ద్వారా కార్మిక హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. 1886 లో అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పనిదినం కోసం కార్మికులు చేసిన చారిత్రాత్మక పోరాటాన్ని స్మరించుకున్నారు. ఆ త్యాగాల ఫలితంగానే నేటి కార్మిక హక్కులు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. కార్మికుల రక్త తర్పణంతో ఎగిరిన ఎర్రజెండా ప్రపంచ కార్మిక వర్గానికి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. కార్మిక హక్కులను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరాటానికి ఎఐటియుసి ఇచ్చే పిలుపుకు కార్మికులంతా ఏకమవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, సహాయ కార్యదర్శి రాము, వైస్ ప్రెసిడెంట్ క్రిస్టోఫర్, సీనియర్ నాయకులు ఎర్రగని క్రిష్ణయ్య, నాగయ్య, నితిన్, నరేష్, సుధీర్, సూర్యప్రభ, రమేష్, రబ్బానీ, ఎం.శ్రీను, గణేష్, ప్రవీణ్, లక్ష్మయ్య, కొత్తూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.


## సర్వరం రోడ్డు లో ప్రమాదకర మలుపు.. సేఫ్టీ సూచికలు లేక వాహనదారులకు ముప్పు !



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 01 (వార్త సంధ్య) :** సుజాతనగర్ మండలం పరిధిలోని కోయగూడెం గ్రామపంచాయతీ నుంచి సర్వారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న ఒక ప్రమాదకర మలుపు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ మలుపు వద్ద ముందస్తు హెచ్చరికలు తెలియజేసే సేఫ్టీ సూచికలు లేకపోవడంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే పరిస్థితి నెలకొంది. ప్రత్యేకంగా ఈ మలుపు చాలా కఠినంగా ఉండటంతో, ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించవు. అయితే ఇక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, క్యాట్ ఐస్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. రాత్రి వేళల్లో లైటింగ్ సదుపాయం కూడా తక్కువగా ఉండటంతో డ్రైవర్లు మలుపును ముందుగానే గుర్తించడం కష్టమవు తోంది. వర్షాకాలంలో పరిస్థితి ఇంకా దారుణంగా మారుతోంది. రోడ్డుపై నీరు నిల్వ ఉండడం, మట్టికలిసిపోవడం వల్ల వాహనాలు జారి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో పలు చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసు కున్నాయని స్థానికులు చెబుతున్నారు. అదృష్టవశాత్తూ పెద్ద ప్రాణనష్టం జరగకపోయినా, పరిస్థితి ఇలానే కొనసాగితే ఎప్పుడైనా భారీ ప్రమాదం సంభవించే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. స్థానిక ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. కనీసం హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను చాలా వరకు తగ్గించవచ్చని వారు సూచిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఈ ప్రమాదకర మలుపు వద్ద అవసరమైన సేఫ్టీ సూచికలు, రహదారి భద్రతా చర్యలు వెంటనే చేపట్టాలని, వాహనదారుల ప్రాణాలను కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఘనంగా మే డే వేడుకలు కార్మికుల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ

**టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్**



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** ప్రపంచ కార్మికుల హక్కులను గుర్తించిన రోజైన 'మే డే'ను పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గవ్యాప్తంగా వేడుకలు మిన్నంటాయి. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి పలుచోట్ల ఐఎన్టీయూసీ జెండాలను ఆవిష్కరించారు.వార్డు పరిధిలో పార్టీ నాయకులూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్ క్యాంపును బండి రమేష్ ప్రారంభించారు. ఈ శిబిరంలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సుమారు 100 మంది జీహెచ్ఎంసీ కార్మికులకు బండి రమేష్ చేతుల మీదుగా మందులను పండ్లు చీరలను పంపిణీ చెసారు .అనంతరం మూసాపేటలో ఐఎన్టీయూసీ నాయకుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు, కార్మిక చట్టాలను గౌరవించి వారి హక్కులకు చట్టబద్ధత కల్పించిన ఘనత ఒక్క కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. అమెరికాలో మొదలైన ఈ ఉద్యమం నేడు ప్రపంచవ్యాప్తంగా కార్మికుల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఆసుపత్రి వైద్య సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో జీహెచ్ఎంసీ కార్మికులు పాల్గొన్నారు.

## గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాల పెంపు...

**రాష్ట్ర ఐటి,పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు**

**డిజిటల్ అక్షరాస్యతతో భవిష్యత్తుకు బలమైన పునాది**

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆధునిక సాంకేతిక శిక్షణ**

**మంథని లో నిర్వహిస్తున్న "సూపర్ సమ్మర్" శిబిరాన్ని సందర్శించిన మంత్రి శ్రీధర్ బాబు**






**మంథని, మే 01( వార్త సంధ్య) :** గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు,శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం మంథని పట్టణంలో నిర్వహిస్తున్న "సూపర్ సమ్మర్" వేసవి శిబిరాన్ని మంత్రి శ్రీధర్ బాబు సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. టి-ఫైబర్ సంస్థ, సూపర్ టీచర్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్ వంటి ఆధునిక రంగాలలో శిక్షణ అందించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను మంత్రి పరిశీలించారు. కంప్యూటర్ ప్రాథమిక నైపుణ్యాలు, ఏఐ భావనలు,రోబోటిక్స్ అనువర్తనాలలో విద్యార్థులు సాధించిన పురోగతిని అభినందించారు. గ్రామీణ ప్రాంతాలకు సాంకేతిక విద్యను చేరువ చేయడంలో టి-ఫైబర్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని మంత్రి పేర్కొన్నారు. వేగంగా మారుతున్న ప్రపంచంలో డిజిటల్ అక్షరాస్యత ఎంతో అవసరమని ఆయన అన్నారు. రోబోటిక్స్ విభాగంలో విద్యార్థులు రూపొందించిన మూన్ ల్యాండర్ నమూనాను మంత్రి కి వివరించారు. అంతరిక్ష పరిశోధనలో దీనికి ఉన్న ప్రాముఖ్యతను విద్యార్థులు వివరించగా మంత్రి అభినందించారు. డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసి, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందుబాటులోకి తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం మంథని నుండి సుమారు 70 మంది విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొంటుండగా, పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా మొత్తం 351 మంది విద్యార్థులు ఈ నెల రోజుల కార్యక్రమంలో నమోదు చేసుకున్నారు. రామగుండం, పెద్దపల్లి, సుల్తానాబాద్ ప్రాంతాలలో వారం రోజుల చొప్పున శిక్షణా తరగతులతో ఈ కార్యక్రమాన్ని దశలవారీగా నిర్వ హిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు,విద్యాశాఖ ప్రతి నిధులు, కార్యక్రమ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

## మంథని అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి

**రాష్ట్ర ఐటి,పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**

**గోదావరిలో స్వచ్ఛ జలాలు ఉండేలా చర్యలు**

**పట్టణ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి**

**ప్రభుత్వ భవనాల్లో గాలి, వెలుతురు సౌకర్యాలు మెరుగ్గా ఉండాలి**

**మంథనిలో విస్తృతంగా పర్యటించిన మంత్రి శ్రీధర్ బాబు**





**మంథని, మే-01( వార్త సంధ్య) :** మంథని పట్టణ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం మంథని పట్టణంలో మంత్రి దుద్దిళ్ల



శ్రీధర్ బాబు విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరి నదిని సందర్శించిన మంత్రి, నదిలో స్వచ్ఛమైన నీరు ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.నిర్మాణంలో ఉన్న కొత్త మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించిన మంత్రి, భవన నిర్మాణంలో కొన్ని మార్పులు సూచించారు. ప్రతి గది స్పష్టంగా కనిపించేలా ఉండాలని, సమృద్ధిగా గాలి, వెలుతురు వచ్చే విధంగా నిర్మాణం చేయాలని తెలిపారు. విద్యుత్ వినియోగం సమర్థవంతంగా ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని, ప్రతి గదికి కిటికీలు ఉండాలని సూచించారు.అలాగే నిర్మాణంలో ఉన్న ఎంఆర్వో, ఆర్డీవో, సమగ్ర మండల కార్యాలయ సముదాయాలను పరిశీలించి,పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.ఎంపీడీవో కార్యాలయంలోని పాత భవనాన్ని ఐటి శాఖకు కేటాయించి పునరుద్ధరణ చేపట్టాలని మంత్రి సూచించారు.మంథనిలోని అయ్యగారి చెరువును సందర్శించిన మంత్రి, బండ్ సుందరీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని,రహదారి క్లియర్ చేసే చర్యలు తీసుకోవాలని నీటిపారుదల అధికారులను ఆదేశించారు. అలాగే టాస్క్ కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి,కొన్ని చిన్న మార్పులు చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఆర్డీవో సురేష్, ఎమ్మార్వో ఆరిఫ్ ఉద్దీన్ , మున్సిపల్ కమిషనర్ మనోహర్, అధికారులు, మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, మంథని సత్యం తదితరులు మంత్రితో పాటు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం పై నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేసేంతవరకు పోరాడుతాం

**141 వ మేడే వేడుకల్లో సిపిఐ,ఏఐటియుసి నాయకుల హెచ్చరిక.**




**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, గోదావరిఖని, మే 01(వార్త సంధ్య) :** దేశంలోని కార్మిక వర్గానికి నష్టం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేసేంతవరకు పోరాడుతామని,అందుకు సింగరేణి కార్మికులు ఏఐటియుసి ఇచ్చే పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను,సిపిఐ నగర కార్యదర్శి కె.కనకరాజు లు పేర్కొన్నారు.శుక్రవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన 141 వ మేడే వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లు గా విభజించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, కార్మిక వర్గానికి నష్టం వాటిల్లే విధంగా కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పై మేడే స్ఫూర్తితో ఉద్యమాలు,పోరాటాలు నిర్వహించి కార్మిక హక్కులను కాపాడుకోవాలని వారు కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత మందబలంతో కార్మికుల హక్కులను హరించే విధంగా చట్టాలను మార్చడం దుర్మార్గమైన చర్య అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి మేడే స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేసేంతవరకు ఉద్యమాలు నిర్వహించి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని వారు పేర్కొన్నారు.దశాబ్దాల





తరబడి పోరాడి సాధించుకున్న హక్కులు లేబర్ కోడ్ లతో తొలగించబడతాయని, ముఖ్యంగా ఎనిమిది గంటల పని విధానం 12 గంటల పని విధానం అమలు చేయాలని చూస్తుందని,లేబర్ కోడ్ ల అమలు వల్ల ఉద్యోగ భద్రత,వేతన భద్రత ఉండదని,యూనియన్ లు పెట్టుకునే అవకాశం ఉండదని వారు పేర్కొన్నారు. నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేసేంతవరకు,కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కొనసాగించాలనే డిమాండ్ చేస్తూ ఉద్యమాలు నిర్వహించి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని వారు పేర్కొన్నారు.అదే విధంగా ఆర్జీ వన్ ఏరియా లోని గనులు,డిపార్ట్మెంట్స్, ఓసిపి 5 లలో మరియు జనగామ,పవర్ హౌజ్ కాలనీ,ఫైవింక్లయిన్ చౌరస్తా వద్ద నాయకులు మేడే పతాకాలను ఆవిష్కరణ చేశారు.భాస్కర్ రావు భవన్ లో మేడే పతాకావిష్కరణను రంగు శ్రీను,కనకరాజు లు చేయగా,ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ, ఏఐటియుసి నాయకులు గౌతం గోవర్ధన్,గోసిక మోహన్,మాదన మహేష్, బోగ సతీష్ బాబు,ఎస్ వెంకట్ రెడ్డి,ఎం.ఎ.గౌస్, పి.విజయలక్ష్మి,దొంత సాయన్న, చెప్యాల భాస్కర్,ఎం చక్రపాణి, బోయిన స్వామి, ఆకునూరి శంకరయ్య, దాసరి అనిల్,తాళ్ళపెల్లి మల్లయ్య, మాటేటి శంకర్, మడికొండ ఓదెమ్మ, తొడుపునూరి రమేశ్ కుమార్,మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న,గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, బలుసు రవి,బండి మల్లేష్, ఇజ్జగిరి రాజు, ఎం.సత్యనారాయణ, దాసరి శ్రీనివాస్, వేముల అశోక్,రేణికుంట్ల ప్రీతం, ఆసాల నవీన్ తదితరులు పాల్గొన్నారు. మేడే వేడుకల సందర్భంగా కళాకారులు కన్నం లక్ష్మి నారాయణ,లెనిన్,ఎజ్జ రాజయ్య,ఆసాల రమ లు మేడే చైతన్య గీతాలు ఆలపించారు.

## చికాగో వీరుల త్యాగఫలం కార్మిక వర్గానికి దిక్సూచి

**ఎనిమిది గంటల పనిదినం కోసం సాగిన పోరాటం అజరామరం**

**ప్రస్తుత పాలకులు కార్మిక చట్టాలను కాలరాస్తున్నారు**

**44 చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చడం శ్రమశక్తిని దోచుకోవడమే**

**కార్మిక వర్గం ఐక్య పోరాటాల ద్వారానే హక్కులను కాపాడుకోవాలి**

**కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి**

**ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ దేశ ఆర్థిక వ్యవస్థకు గొడ్డలిపెట్టు**

**మేడే స్ఫూర్తితో నూతన పోరాటాలకు సిద్ధం కావాలి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

**సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా 141వ మేడే..723 కేంద్రాల్లో ఎర్రజెండా రెపరెపలు**





**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 01 (వార్త సంధ్య) :** చికాగో వీరుల త్యాగఫలం ప్రపంచ కార్మిక వర్గానికి దిక్సూచి అని, నాడు ఎనిమిది




గంటల పనిదినం కోసం ప్రాణాలర్పించిన వారి స్ఫూర్తితో హక్కుల రక్షణకు సమరశీల పోరాటాలు సాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం 141వ మేడే ఉత్సవాలు శుక్రవారం సిపిఐ, ఏఐటీయూసీ, అనుబంధ ప్రజా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ప్రధాన కూడళ్లు, హమాలీ అడ్డలు, ఆటో స్టాండ్‌లు, భవన నిర్మాణ కార్మిక క్షేత్రాలు, యూనియన్, పార్టీ కార్యాలయాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సాబీర్ పాషా ఎర్రజెండాను ఎగురవేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోస్టాఫీసు సెంటర్లో నిర్వహించిన భారీ ప్రదర్శన నిర్వహించారు. జెండావిష్కరణల అనంతరం జరిగిన సభల్లో సాబీర్ పాషా మాట్లాడుతూ కేంద్రంలోని పాలకులు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ కార్మిక చట్టాలను నీరుగారుస్తున్నారని మండిపడ్డారు. దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా మార్చి కార్మికులను బానిసలుగా మారుస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం దేశ ప్రయోజనాలకు విఘాతమని, ఈ దుర్మార్గపు విధానాలపై కార్మికులు ఐక్యంగా పోరాడా లని కోరారు. మేడే స్ఫూర్తితో అన్యాయమైన విధానాలను ఎదిరించి, పని భద్రత, కనీస వేతనాల సాధన కోసం మరో పోరాట దశకు కార్మిక వర్గం సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా వ్యాపితంగా 723 కేంద్రాల్లో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించి చికాగో అమరవీరుల త్యాగాలు గుర్తుచేసుకున్నామని, కార్మికవర్గ పోరాటాలకు ఈ ఉత్సవాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా నాయకులు దుర్గరాసి వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, గెద్దాడు నగేష్, ఎస్ కె ఫహీమ్, కె రత్నకుమారి, భూక్యా శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, రాంచందర్, పోలమూరి శ్రీనివాస్, భాగం మాధవరావు, యూసుఫ్, పిడుగు శ్రీనివాస్, ధనలక్ష్మి, కూరపాటి సుధాకర్, ధర్మరాజు, జహీర్, షాహీన్, మద్దాల హరిత, దాసరి శ్రీనివాస్, అస్మత్, ఏ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సేవలు అనిర్వచనీయం జన సేన



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా జనసేన నాయకుల ఆధ్వర్యంలో కార్మిక వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ సైబరాబాద్ కార్పొరేషన్ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, జీహెచ్ఎంసీ కార్మికులను ఘనంగా సత్కరించి కార్మికుల సేవలను గుర్తిస్తూ వారికి చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో శ్రమజీవుల పాత్ర కీలకమని, వారి హక్కులు మరియు గౌరవం కోసం జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్మికులకు తమ కృతజ్ఞతలు తెలిపారు.

## కామారెడ్డి వైకుంఠధామల అభివృద్ధికి సుభాష్ రెడ్డి ముందడుగు

**బిజెపి ఎమ్మెల్యే, కౌన్సిలర్లు మద్దతు**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 1 ( వార్త సంధ్య ) :** కామారెడ్డి పట్టణంలోని వైకుంఠధామలను స్వచ్ఛందంగా తన సొంత ఖర్చుతో అత్యంత అద్భుతంగా నిర్మిస్తానని ా= ఫౌండేషన్ అధినేత తిమ్మయ్య సుభాష్ రెడ్డి ప్రకటించారు. ఆయన సంకల్పానికి బిజెపి పార్టీ కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి రమణారెడ్డి పాటు మున్సిపల్ కౌన్సిలర్లు 16 మంది మద్దతు ప్రకటించారు. శుక్రవారం బిజెపి కౌన్సిలర్లు 49 వ వార్డులోని 2 వైకుంఠధామలను సందర్శించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ నుండి వైకుంఠధామాల అభివృద్ధికి కోటి 30 లక్షలు విడుదల చేసినట్లు, వాటిని అభివృద్ధి చేసేందుకు మున్సిపల్ చైర్పర్సన్ ఆలోచిస్తున్నారని బిజెపి కౌన్సిలర్లు తెలిపారు. కామారెడ్డి వైకుంఠధామాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలంటే సుమారు 6 కోట్ల రూపాయలు అవసరమవుతాయని, ఆ ఖర్చును సుభాష్ రెడ్డి తన ఫౌండేషన్ ద్వారా భరించనున్నారని వారు పేర్కొన్నారు. గత రెండు రోజుల క్రితం ా= ఫౌండేషన్ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఒక దాత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆ పని చేస్తానంటే దానికి అడ్డు చెప్పకూడదని, మున్సిపల్ కౌన్సిల్ కేటాయించిన నిధులను కామారెడ్డి లోని ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు వినియోగించాలని ఎమ్మెల్యే వెంకట్ రమణారెడ్డి సూచించినట్లు బిజెపి కౌన్సిలర్లు వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా కామారెడ్డి పట్టణంలో వైకుంఠధామాల అభివృద్ధి వేగవంతం కానుందని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ సన్మానం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 1 ( వార్త సంధ్య ) :** కామారెడ్డి జిల్లా కేంద్రం లోని =&దీ గెస్ట్ హౌస్ కి విచ్చేసిన ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కలిసి సన్మానించిన మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాని శ్రీనివాస్. సహచర కౌన్సిలర్ల తో కలిసి షాలువా,మెమెంటో తో సత్కారించి, ముదిరాజ్ ప్రజల అభివృద్ధి కోసం పాలు విషయాలపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయ కులు ఇప్ప శ్రీనివాస్,కాళ్ల గణేష్,సత్యం,అంజాద్, భాస్కర్ గౌడ్,వాజీద్,సిద్ధిఖ్,యూనస్,లడ్డు,రమేష్, నాగరాజు,లక్ష్మణ్,దయ్యాకర్ తదితరులు పాల్గొన్నారు

## జయంతి-కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 01:** చైతన్యపురి డివిజన్ పరిధిలోని శ్రీశ్రీశ్రీ (కోసగుండ్ల) ఫణిగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నందు నిర్వహించిన లక్ష్మీ నరసింహస్వామి వారి జయంతి-కళ్యాణ మహోత్సవంలో ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, భక్తులు ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ దేవస్థానం అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి,ఫణిగిరి కాలనీ కోసగుండ్ల నర్సింహాస్వామి దేవాలయం చైర్మన్ కృష్ణారెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,నరేందర్ రెడ్డి,శ్రీహరి,రత్నాకర్ రెడ్డి ,ప్రభు ,రామారావు,గణేష్,నాగరాజు,మహేష్,రాకేష్,జలంధర్,నరేశ్,శ్రీధర్ మరియు స్థానిక నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవుల్లో వారికి సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఉంది - మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్

**బీజేపీ, ఆర్ఎస్ఎస్ ల మతపరమైన విభజన రాజకీయాలను తిప్పికొట్టే శక్తి సేవాదళ్ కు ఉంది**




**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 01:** కాంగ్రెస్ పార్టీకి సేవాదళ్ పునాది లాంటిదని, 140 ఏళ్ల కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తూ నేటికీ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో కొనసాగుతున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ 'సమర్థ - శిక్షణ శిబిరం' కార్యక్రమానికి శుక్రవారం మధుయాష్కి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి.. సేవాదళ్ కార్యకర్తల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర పోరాటంలో సేవాదళ్ పాత్ర మరువలేనిది అన్నారు. దేశ ప్రజల్లో స్వాతంత్ర కాంక్షను బలంగా తీసుకెళ్లి స్వాతంత్రం కోసం సైనికుల్లా సేవాదళ్ కార్యకర్తలు పని చేశారన్నారు. సేవాదళ్ లో పని చేసిన జవహర్ లాల్ నెహ్రూ ప్రధానిగా దేశానికి అందించిన సేవలను గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా సేవాదళ్ కార్యకర్తలు తమ సొంత డబ్బులు వెచ్చించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, పార్టీ విధానాలను ప్రజల్లో తీసుకెళుతున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి సేవాదళ్ కార్యకర్తల కృషి మరువలేనిలేన్నారు. అలాంటి సేవాదళ్ కార్యకర్తలకు ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉందని, నామినేటెడ్ పదవులను కేటాయించి వారికి సముచిత గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. దేశంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ లు చేపడుతున్న మతపరమైన విభజన రాజకీయాలకు చెక్ పెట్టే శక్తి సేవాదళ్ కార్యకర్తలకు ఉందన్నారు. ఆ దిశగా సేవాదళ్ కార్యకర్తలు మరింత కృషి చేయాలని సూచించారు. సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ గారు.. సేవాదళ్ బలోపేతానికి, కాంగ్రెస్ పార్టీ పటిష్టానికి చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ , క్యాంపు కోఆర్డినేటర్ దేవేందర్ శర్మ , ఏఐసీసీ కోఆర్డినేటర్ సమాద్ జీ , ప్రతినిధులు శ్రావణ్ కుమార్ , అప్సర్ యూసఫ్ , గోవింద్ రావు, వాజీద్ మెహక్ , మంకాల దాస్, అంజిరెడ్డి , బండి సురేందర్, రేణు కుమార్ , గుర్రం శ్రీనివాస్ రెడ్డి, సుంకరి శ్రీనివాస్ రెడ్డి, వాజీద్ బాషా , నీలకంఠేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయం - టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి

**కామారెడ్డి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీడియాతో గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ,**

**కామారెడ్డి పట్టణంలో స్మశాన వాటిక అభివృద్ధికి ముందుకు వచ్చిన తిమ్మయ్య గారి సుభాష్ రెడ్డి గారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 1 ( వార్తా సంధ్య ) :** కామారెడ్డి పట్టణంలో వైకుంఠదామం నిర్మాణం కోసం కొత్తగా డి.పి.ఆర్ తయారు చేసి ఎస్టిమేట్ వేయించాల్నన్నరు. స్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సుభాష్ రెడ్డి వైకుంఠ దామం నిర్మాణంకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. కామారెడ్డి అభివృద్ధికి సేవ చేసేందుకు ముందుకు వచ్చే వారికి స్వాగతం పలుకుతామన్నారు. కామారెడ్డి సదర్ సంఘం పెద్దలతో ఈవిషయంలో ప్రత్యేక సమావేశము ఏర్పాటు చేసుకొని వైకుంఠధామం అభివృద్ధి చర్యలు తీసుకోవాలన్నారు. గత మున్సిపల్ పాలకవర్గంలో హయాంలో టుఫిట్ కో ఫండ్ నుంచి కోటి రూపాయలు విడుదల కాగా, సంబంధించిన అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు అసంపూర్తిగా నిలిచి పోయా యన్నారు. నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. కామారెడ్డి పట్టణ పరిధిలో ఉన్న అన్ని కుల సంఘాలు, సదరు సంఘాలు, ప్రతినిధులతో మాట్లాడి వైకుంఠ దామం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సేవా కార్యక్రమం ద్వారా ముందుకు వస్తున్న తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి గారిని స్వయంగా కలిసి అభినందిస్తామన్నారు. దీనికి కామారెడ్డి జిల్లా కలెక్టర్ నుండి ఇప్పించడానికి అవసరమైతే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి గారి, పిసిసి బొమ్మ మహేష్ కుమార్ గారి దృష్టికి తీసుకెళ్లి ఇప్పిస్తామని టి పి సి సి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. కామారెడ్డి ఎమ్మెల్యే రెండున్నర సంవత్సరాలుగా అభివృద్ధిపై శ్రద్ధ కనపరచడం లేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ గడ్డమీది మహేష్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జూలూరు సుధాకర్, క్రీడా అధ్యక్షులు నర్సాగౌడ్, మాజీ కౌన్సిలర్లు జమీల్, చాట్ల వంశీ, సలీం, కాంగ్రెస్ నాయకులు రంగా రమేష్ గౌడ్, మెహర్ బాబా గౌడ్, నర్సుల మహేష్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## కామారెడ్డి పట్టణంలో పాత బస్టాండ్

**వద్ద అన్నదానం ఎంతోమంది ఆకలి తీరుస్తుంది:**

**మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి**




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 1( వార్తా సంధ్య ) :** "అన్నదానం అనేది గొప్ప సంస్కారం, అది ఎంతోమంది ఆకలిని తీరుస్తుంది" అని కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అన్నారు. శ్రీ సర్వదేవత పరంజ్యోతి భగవతి ఆలయ (కల్కి ఆలయం) ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద గత మూడేళు ్లగా ప్రతి పౌర్ణమికి నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

**నిరంతర సేవ:**

గత మూడేళ్లుగా జరుగుతున్న ఈ అన్నదాన కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు సుమారు లక్ష మంది పేదల ఆకలి తీర్చడం అభినందనీయమని ఆమె కొనియాడారు.

**దాతల సహకారం:**

ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలందరికీ భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు.

**పౌర్ణమి విశిష్టత:**

పౌర్ణమి రోజున అన్నదానం చేయడం వల్ల వంశాభివృద్ధి జరుగుతుందని, భక్తులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

**వంశాభివృద్ధి పూజ:**

నెలకు కేవలం ₹251 చెల్లించి, ఆలయంలో జరిగే వంశాభివృద్ధి పూజలో పాల్గొంటూ అన్నదానానికి సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.

**సన్మాన కార్యక్రమం:**

ఈ సందర్భంగా అన్నదానానికి సహకరిస్తున్న దాతలను మరియు నిరంతరం శ్రమిస్తున్న స్వచ్ఛంద సేవకులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఘనంగా సన్మానించారు. పాల్గొన్న వారు: ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అన్వర్, షేర్, సిద్ధిక్, సత్యం, కాళ్ల గణేష్, నీల నాగరాజు, ఇటుకల శ్రీనివాస్, ప్రేమ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరులో ఎల్‌వీ ప్రసాద్ ఐ కేర్ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు

**కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో ఎల్వీ ప్రసాద్ ఐ కేర్ సెంటర్ ప్రారంభం**

**ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం**

**రూ.7 కోట్ల వ్యయంతో దాతల సహకారంతో ఆసుపత్రి నిర్మాణం**

**కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్**

**ప్రారంభం అనంతరం ఆసుపత్రిలోని విభాగాలను పరిశీలించిన సీఎం**



కృష్ణా జిల్లా ప్రజలకు అత్యాధునిక కంటి వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు గుడ్లవల్లేరులో నూతనంగా నిర్మించిన ఎల్వీ ప్రసాద్ ఐ కేర్ సెంటర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ప్రారంభించారు. తన జిల్లా పర్యటనలో భాగంగా ఆయన ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ప్రారంభోత్సవంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కూడా పాల్గొన్నారు. దాతల సహాయంతో సుమారు రూ.7 కోట్ల వ్యయంతో ఈ ఆసుపత్రిని నిర్మించారు. గుడ్లవల్లేరు




ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని పెంజేంద్ర రోడ్డులో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులతో కలిసి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. అక్కడి సౌకర్యాలు, వైద్య పరికరాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన ఎకరం భూమిని, నిర్మాణ ఖర్చులను దాతలైన జాస్తి సుబ్బారావు, పోలవరపు సత్యనారాయణరావు కుటుంబాలు అందించాయి. కృష్ణా జిల్లా, పరిసర ప్రాంతాల ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన కంటి వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని నెలకొల్పారు. ఈ కేంద్రం ప్రారంభంతో, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని స్థానికులు భావిస్తున్నారు.

# హైదరాబాద్‌లో వైరల్ అవుతున్న హార్ట్ షేప్ గ్లాస్ బ్రిడ్జ్!



పర్యాటక ప్రేమికులకు ఒక అదిరిపోయే శుభవార్త! మన తెలంగాణలో ఒక సరికొత్త టూరిస్ట్ అట్రాక్షన్ సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు మనం చైనాలోనో లేక కేరళ, సిక్కిం వంటి రాష్ట్రాల్లోనో ఇలాంటి గ్లాస్ బ్రిడ్జిలను చూశాం. కానీ, ఇప్పుడు మన హైదరాబాద్ (ఎంఎవతీఘెఎ) కు అతి సమీపంలోనే ఇలాంటి ఒక అద్భుతమైన గ్లాస్ బ్రిడ్జ్ రూపుదిద్దుకుంటోంది. అది కూడా ఒక వెరైటీ 'హార్ట్ షేప్' (గుండె ఆకారం) డిజైన్‌తో రాబోతుండటం విశేషం. ఈ అద్భుతమైన గ్లాస్ బ్రిడ్జ్ సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గంలో గల ఎల్కమ్మ చెరువు వద్ద నిర్మితమవుతోంది. హైదరాబాద్ నుండి ఇది సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అంటే శని, ఆదివారాల్లో సరదాగా ఫ్యామిలీతో కలిసి వెళ్లి రావడానికి ఇది ఒక పర్ఫెక్ట్ వీకెండ్ డెస్టినేషన్ కాబోతోంది. ఈ బ్రిడ్జ్ ప్రత్యేకత ఏంటంటే.. ఇది ఒక సరస్సుపై నిర్మిస్తున్నారు. దీనికి అమర్చిన ట్రాన్స్‌పరెంట్ గ్లాస్ ప్యానెల్స్ వల్ల, మీరు ఆ బ్రిడ్జ్ మీద నడుస్తుంటే మీ కాళ్ళ కింద మెరుస్తున్న సరస్సు నీళ్లు క్లియర్ గా కనిపిస్తాయి. ఇది చూడ్డానికి ఎంత థ్రిల్లింగ్‌గా ఉంటుందో, కాస్త భయంగా కూడా అనిపిస్తుంది. కానీ ఆధునిక ఇంజనీరింగ్ టెక్నాలజీతో దీనిని చాలా సురక్షితంగా నిర్మిస్తున్నారు. ఈ వంతెనను హార్ట్ షేప్‌లో డిజైన్ చేయడం వెనుక ఒక పెద్ద కారణమే ఉంది. ఇది కేవలం ఒక ఇంజనీరింగ్ అద్భుతం మాత్రమే కాదు, చూడగానే ఆకట్టుకునేలా ఉండాలని ప్లాన్ చేశారు. ముఖ్యంగా యువతకు, జంటలకు ఇది ఒక క్రేజీ సెల్ఫీ పాయింట్‌లా మారుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మధ్య కాలంలో దీనికి సంబంధించిన డ్రోన్ వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఆ విజువల్స్ చూస్తుంటేనే అక్కడికి ఎప్పుడు వెళ్దామా అనే క్యూరియాసిటీ పెరుగుతోంది. ఒకప్పుడు కేవలం వ్యవసాయానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న సిద్దిపేట, ఇప్పుడు పర్యాటక రంగంలో దూసుకుపోతోంది. రోడ్డు , రైలు మార్గాలు మెరుగుపడటంతో సిటీ నుండి ఇక్కడికి చేరుకోవడం చాలా సులువుగా మారింది. ఈ గ్లాస్ బ్రిడ్జ్ అందుబాటులోకి వస్తే, స్థానిక ప్రజలకు ఉపాధి పెరగడమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా పర్యాటకులు ఇక్కడికి క్యూ కట్టడం ఖాయం. ప్రస్తుతానికి ఈ వంతెన పనులు తుది దశలో ఉన్నాయి. ఇది ఇంకా అధికారికంగా ప్రారంభం కాలేదు. కాబట్టి మీరు ఈ కొత్త అనుభూతిని పొందాలనుకుంటే మరికొన్ని రోజులు ఓపిక పట్టాల్సిందే. ప్రారంభోత్సవం గురించి అప్‌డేట్ రాగానే ప్లాన్ చేసుకోండి. రద్దీ పెరగకముందే వెళ్తే ప్రశాంతంగా ఈ హార్ట్ షేప్ గ్లాస్ బ్రిడ్జ్ అందాలను ఆస్వాదించవచ్చు.

# దేశంలో కొత్త శకం.. ఇక టోల్ ప్లాజాలో ఆగక్కర్లేదు!

**దేశంలో తొలి బారియర్-ఫ్రీ టోల్ ప్లాజా ప్రారంభం**

**సూరత్ సమీపంలో ఆగకుండానే టోల్ చెల్లించే విధానం**

**ఫాస్ట్‌ట్యాగ్, నంబర్ ప్లేట్ రీడింగ్ ద్వారా ఆటోమేటిక్‌గా వసూలు**

**2026 చివరి నాటికి దేశవ్యాప్తంగా అమలుకు కేంద్రం ప్రణాళిక**

**ట్రాఫిక్ రద్దీకి చెక్, భారీగా ఇంధనం ఆదా అయ్యే అవకాశం**



దేశంలో టోల్ వసూళ్ల విధానంలో ఒక విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టారు. వాహనాలు టోల్ ప్లాజాల వద్ద ఆగకుండానే ప్రయాణించేందుకు వీలు కల్పించే భారతదేశపు మొట్టమొదటి బారియర్-ఫ్రీ టోల్ ప్లాజా కార్యకలాపాలు ప్రారంభించింది. ముంబై-ఢిల్లీ జాతీయ రహదారిపై సూరత్ సమీపంలోని చోర్యాసి టోల్ ప్లాజా వద్ద ఈ అధునాతన వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. ఫిబ్రవరి 2 నుంచి దాదాపు రెండు నెలల పాటు విజయవంతంగా పరీక్షించిన తర్వాత దీనిని పూర్తిస్థాయిలో ప్రారంభించారు. ఈ కొత్త విధానంలో టోల్ ప్లాజాల వద్ద భౌతికంగా అడ్డంకులు (బారియర్లు) ఉండవు. మల్టీ-లేన్ ఫ్రీ ఫ్లో టెక్నాలజీ ఆధారంగా ఈ వ్యవస్థ పనిచేస్తుంది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ దీనిని అమలు చేస్తోంది. వాహనాలు టోల్ ప్లాజా వద్దకు రాగానే, పైన ఏర్పాటు చేసిన గ్యాంట్రీలపై ఉన్న హై-రిజల్యూషన్ కెమెరాలు ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ టెక్నాలజీతో వాహనం నంబర్ ప్లేట్‌ను స్కాన్ చేస్తాయి. అదే సమయంలో, సెన్సార్లు ఫాస్ట్‌ట్యాగ్ వివరాలను గ్రహించి, లింక్ అయిన బ్యాంకు ఖాతా నుంచి టోల్ రుసుమును ఆటోమేటిక్‌గా మినహాయిస్తాయి. ఈ ప్రక్రియ మొత్తం వాహనం ఆగకుండానే జరిగిపోతుంది. "ఈ బారియర్-లెస్ టోలింగ్‌తో వాహనాన్ని ఎక్కడా ఆపాల్సిన అవసరం లేదు. వాహనం గ్యాంట్రీ కింద నుంచి వెళ్లగానే టోల్ రుసుము ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది" అని ఎన్‌హెచ్‌ఏఐ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎ.ఆర్. చిత్రాన్సి వివరించారు. ఈ వ్యవస్థ ద్వారా వాహనాలు గంటకు 80 కిలోమీటర్ల వేగంతో కూడా టోల్ ప్లాజాను దాటి వెళ్లవచ్చు. దీనివల్ల టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్ రద్దీ, పొడవైన క్యూలు తగ్గుతాయి. ఒకవేళ వాహనానికి ఫాస్ట్‌ట్యాగ్ లేకపోయినా లేదా పనిచేయకపోయినా, నంబర్ ప్లేట్ ఆధారంగా వాహనాన్ని గుర్తించి, రిజిస్టర్డ్ యజమానికి టోల్ చెల్లించమని ఎలక్ట్రానిక్ నోటీసు పంపిస్తారు. కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించిన ప్రకారం, 2026 చివరి నాటికి దేశవ్యాప్తంగా 1,050కి పైగా టోల్ ప్లాజాలను ఏఐ ఆధారిత బారియర్-ఫ్రీ వ్యవస్థలుగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం వల్ల ఏటా రూ.1,500 కోట్ల ఇంధనం ఆదా అవ్వడంతో పాటు, మెరుగైన వసూళ్ల ద్వారా ప్రభుత్వానికి అదనంగా రూ.6,000 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# విద్యాశాఖలో లోకేశ్ మార్క్.. ఫొటోల్లేకుండానే విద్యార్థుల ఫలితాల ప్రకటన

**ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఫలితాలతో వినూత్న ప్రచారానికి శ్రీకారం**

**సీఎం, మంత్రి ఫొటోలు లేకుండా విద్యార్థుల ఫొటోలతోనే పేపర్ ప్రకటనలు**

**రాజకీయాలకు అతీతంగా విద్యావ్యవస్థను తీర్చిదిద్దడమే లక్ష్యమన్న లోకేశ్**

**ప్రభుత్వ పథకాలకు డొక్కా సీతమ్మ, సర్వేపల్లి వంటి మహనీయుల పేర్లు**

**స్కూల్ వస్తువులపై నేతల ఫొటోలు, పార్టీ రంగులు ఉండవన్న మంత్రి**




ఏపీ విద్యావ్యవస్థలో నూతన శకానికి నాంది పలుకుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల ప్రతిభను చాటిచెబుతూ, రాజకీయాలకు అతీతంగా విద్యారంగాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో ఆయన కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల వివరాలతో ప్రముఖ దినపత్రికల్లో పూర్తి పేజీ ప్రకటనలు ఇవ్వడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సాధారణంగా ప్రభుత్వ ప్రకటనలంటే ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రుల ఫొటోలు, ప్రభుత్వ నినాదాలతో నిండి ఉంటాయి. కానీ, ఈ ప్రకటనలు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. వీటిలో ఎక్కడా సీఎం చంద్రబాబు నాయుడు గానీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఫొటోలు గానీ కనిపించవు. కేవలం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల ఫొటోలు, వారు చదివిన ప్రభుత్వ పాఠశాలల వివరాలను మాత్రమే ప్రముఖంగా ప్రచురించారు. "ప్రభుత్వ విద్యాలయాలు సగర్వంగా నిలబడి" అనే ఆత్మవిశ్వాసం మినహా ఎలాంటి రాజకీయ ప్రచార ఆర్భాటాలకు తావివ్వలేదు. ఈ విధానం ద్వారా విద్యార్థుల ప్రతిభకే అసలైన గుర్తింపు ఇస్తున్నామనే స్పష్టమైన సందేశాన్ని ప్రభుత్వం పంపింది. విద్యా రంగాన్ని రాజకీయ రంగులకు దూరంగా ఉంచాలనేది తన ప్రధాన లక్ష్యమని మంత్రి లోకేశ్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచే స్పష్టం చేస్తున్నారు. ఈ ఆలోచనకు అనుగుణంగానే ప్రభుత్వ పథకాలకు మహనీయుల పేర్లు పెడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం' అని, విద్యార్థులకు మార్గనిర్దేశం చేసే కార్యక్రమానికి 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' అని నామకరణం చేశారు. అదేవిధంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వంటి స్ఫూర్తిప్రదాతల పేర్లను ఇతర పథకాలకు పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అంతేగాక విద్యార్థులకు అందించే పుస్తకాలు, దుస్తువులు, ఇతర వస్తువులపై ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు గానీ, కూటమి ప్రభుత్వ రంగులు గానీ ముద్రించవద్దని లోకేశ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పారదర్శకత, జవాబుదారీతనం లక్ష్యంగా విద్యాశాఖను నడపాలని ఆయన భావిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, సుశిక్షితులైన ఉపాధ్యాయుల ద్వారా "అమ్మలా శిక్షణ, నాన్నలా రక్షణ" అందిస్తామని, తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఈ ప్రకటనల ద్వారా తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఈ చర్యల ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యాలయాలను నిలపాలన్న మంత్రి లోకేశ్ సంకల్పం స్పష్టంగా కనిపిస్తోంది.

# కేరళలో దారుణం.. తల్లి, సోదరుడిని చంపి ఇంటి ఆవరణలోనే పూడ్చిపెట్టిన వ్యక్తి!

**ఎకరం భూమి పంపకాల వివాదమే హత్యలకు కారణం**

**ఆటో డ్రైవర్ అనుమానంతో రంగంలోకి దిగిన పోలీసులు**

**నిందితుడి తండ్రి అదృశ్యం కేసును కూడా తిరగదోడుతున్న అధికారులు**



కేరళలోని ఇడుక్కి జిల్లాలో ఆస్తి కోసం కన్నతల్లి, సోదరుడిని ఓ వ్యక్తి అత్యంత కిరాతకంగా హత్య చేసి, వారి మృతదేహాలను ఇంట్లోనే పూడ్చిపెట్టిన దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ జంట హత్యల కేసులో నిందితుడైన సజీ (45)ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆస్తి పంపకాల విషయంలో తలెత్తిన వివాదాలే ఈ ఘోరానికి దారితీశాయని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. పొన్నాట్టిల్ కుటుంబానికి చెందిన సజీ, అతని సోదరుడు రెజీ (40), తల్లి మేరీకుట్టి (65)తో కలిసి నివసిస్తున్నాడు. కుటుంబానికి చెందిన సుమారు ఎకరం భూమిని పంచుకోవడంపై సోదరుల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఒకరోజు రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన రెజీతో సజీకి వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరగడంతో రెజీ ముఖంపై సజీ తీవ్రంగా దాడి చేశాడు. అతను స్పృహ కోల్పోయిన తర్వాత టవల్‌తో గొంతు నులిమి హత్య చేశాడు. ఈ హత్యను చూసిన కన్నతల్లి మేరీకుట్టిని కూడా ముఖంపై కొట్టి, ఊపిరాడకుండా చేసి చంపేశాడు. రెండు రోజుల పాటు మృతదేహాలను ఇంట్లోనే దాచిపెట్టి, ఆ తర్వాత ఇంటి ఆవరణలోనే గొయ్యి తీసి పూడ్చిపెట్టాడు. ఈ హత్యలు చేయడంలో తనకు ఎవరూ సహాయం చేయలేదని, ఒక్కడినే ఈ ఘాతుకానికి పాల్పడ్డానని సజీ పోలీసుల ఎదుట అంగీకరించినట్లు సమాచారం. దాదాపు నెల రోజుల నుంచి మేరీకుట్టి, రెజీ కనిపించకపోవడంతో చుట్టుపక్కల వారికి సజీ పొంతనలేని సమాధానాలు చెప్పాడు. అయితే, అనారోగ్యంతో ఉండే మేరీకుట్టిని తరచూ ఆసుపత్రికి తీసుకువెళ్లే ఓ ఆటో డ్రైవర్‌కు అనుమానం వచ్చింది. రెజీ చేసే పనులను సజీ చేస్తుండటంతో అతనికి అనుమానం బలపడింది. ఈ విషయాన్ని అతను అనక్కరలో నివసిస్తున్న వారి సోదరి సినికి తెలియజేశాడు. ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. పోలీసులు సోమవారం సజీ ఇంటికి చేరుకోగా, వారిని చూసి అతను పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో అనుమానం బలపడిన పోలీసులు ఇంటి ఆవరణలో తవ్వకాలు జరపగా రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. నిందితుడు సజీని మంగళవారం అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కాగా, 2018లో వీరి తండ్రి మాథ్యూ కూడా అదృశ్యమయ్యాడు. ఆ ఘటనతో ఈ హత్యలకు ఏమైనా సంబంధం ఉందా? అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మహబూబ్ నగర్ జిల్లాలో దారుణం... నవజాతశిశువును పీక్కుతిన్న వీధికుక్కలు

**జిల్లాలోని జడ్చర్ల పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో విషాదకర సంఘటన**

**గుట్ట పక్కన నవజాతశిశువును పడేసి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు**

**శిశువును కుక్కలు కొరికి తినడం చూసి పోలీసులకు స్థానికుల సమాచారం**



మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో దారుణం జరిగింది. నవజాత శిశువును వీధికుక్కలు పీక్కుతిన్న విషాదకర సంఘటన చోటు చేసుకుంది. జడ్చర్ల పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని గుట్ట పక్కన గుర్తు తెలియని వ్యక్తులు నవజాత శిశువును పడవేసి వెళ్లిపోయారు. అక్కడే ఉన్న వీధికుక్కలు ఆ శిశువును కొరికి తినేశాయి. శిశువు శరీర భాగాలను గుర్తించిన స్థానికులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఏం జరిగింది, నవజాత శిశువును గుట్ట పక్కన పడేసింది ఎవరు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

# తెలంగాణలో పెట్రోల్, డీజిల్ సరఫరాపై కిషన్ రెడ్డి ట్వీట్

**ఇంధన సరఫరాకు ఎలాంటి కొరత లేదన్న కిషన్ రెడ్డి**

**కొరత భయాలతో పెట్రోల్ బంకులకు ప్రజలు క్యూ కట్టవద్దని విజ్ఞప్తి**

**నిన్న పెట్రోల్ వినియోగం రోజువారి సగటుతో రెండింతలు, డీజిల్ రెండున్నర రెట్లు పెరిగినట్లు వెల్లడి**



తెలంగాణ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సరఫరాకు ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఇంధన కొరత భయాలతో హైదరాబాద్ నగరం సహా పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం కొరత లేదని ప్రకటించింది. తాజాగా, కిషన్ రెడ్డి కూడా ఆందోళన అవసరం లేదని 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. అంతేకాదు, తెలంగాణలో పెట్రోల్, డీజిల్ వినియోగం ఎలా పెరుగుతుందో గణాంకాలు పేర్కొన్నారు. పెట్రోల్ రోజువారి సాధారణ సగటు 6,920 కిలోలీటర్లుగా ఉండగా, నిన్న ఒక్కరోజే 12,875 కిలోలీటర్లు సరఫరా జరిగిందని తెలిపారు. డీజిల్ సాధారణ సగటు 9,017 కిలోలీటర్లు కాగా, నిన్న 21,295 కిలోలీటర్ల పంపిణీ జరిగినట్లు వెల్లడించారు. డిమాండ్‌కు మించి సరఫరా జరుగుతోందని కిషన్ రెడ్డి వెల్లడించారు. అందుకే సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. పుకార్లు నమ్మి పెట్రోల్ బంకుల వద్దకు వచ్చి అనవసరంగా క్యూ కట్టవద్దని పేర్కొన్నారు. అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని ప్రజలకు కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఉద్యోగం రాదన్న ఆవేదనతో అమెరికాలో తెలుగు యువకుడి ఆత్మహత్య

**షికాగోలో ఎంఎస్ పూర్తి చేసిన కర్నూలుకు చెందిన చందు**

**ఉద్యోగం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ దక్కని ఫలితం**

**ఆర్థిక సమస్యలు, భవిష్యత్తుపై ఆందోళనతో ఆత్మహత్య**



అమెరికాలో కర్నూలు యువకుడు చందు ఆత్మహత్య చేసుకున్న వార్త తెలుగు రాష్ట్రాల్లో విషాదాన్ని నింపుతోంది. 26 ఏళ్ల వయసులో, ఎన్నో ఆశలతో ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్ళిన యువకుడు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అందరి హృదయాలను కలచివేస్తోంది. కర్నూలుకు చెందిన ఇరగనబోయిన చందు షికాగోలోని డీపాల్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తి చేశాడు. ప్రస్తుతం అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ 2.0 ప్రభుత్వంలో నెలకొన్న పరిస్థితులు, హెచ్-1బి వీసా నిబంధనల మార్పుల వల్ల కొత్తగా చదువు పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు రావడం సవాలుగా మారింది. చందు కూడా గత కొంతకాలంగా ఉద్యోగం కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. తన ఖర్చుల కోసం మళ్ళీ తల్లిదండ్రులపైనే ఆధారపడాల్సి వస్తోందన్న భావన అతనిని మరింత కృంగదీసింది. ఆ ఆర్థిక ఇబ్బందులు, భవిష్యత్తుపై నెలకొన్న ఆందోళన తట్టుకోలేక ఏప్రిల్ 28న తన గదిలోనే తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# పటాన్‌చెరులో రోడ్డుపై ఖరీదైన హస్కీ జాతి శునకాలు.. వదిలేసిన గుర్తు తెలియని వ్యక్తులు

**ఎండ వేడికి తట్టుకోలేక ఒకటి మృతి, పలు కుక్కలకు అస్వస్థత**

**జంతు ప్రేమికుల చొరవతో 8 శునకాలను కాపాడిన వైనం**

**ఘటనపై మిస్టరీ, దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**మిగిలిన వాటి ఆచూకీ కోసం వలంటీర్ల గాలింపు**



నగర శివార్లలో అత్యంత అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఖరీదైన సైబీరియన్ హస్కీ జాతికి చెందిన సుమారు 30 నుంచి 40 శునకాలను గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డుపై వదిలివెళ్లారు. ఎండ వేడిమికి తట్టుకోలేక, ఆహారం, నీరు లేక అవి తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. ఈ ఘటనలో ఒక శునకం ప్రాణాలు కోల్పోయింది. పటాన్‌చెరు-శంకర్‌పల్లి మార్గంలో ఏప్రిల్ 21న గుర్తుతెలియని వ్యక్తులు ఓ కంటైనర్‌లో ఈ శునకాలను తెచ్చి వదిలి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. చల్లని వాతావరణాన్ని ఇష్టపడే ఈ జాతి కుక్కలు, తీవ్రమైన ఎండలకు తాళలేక నీరసించిపోయాయి. వాటి రూపం నక్కలను పోలి ఉండటంతో చాలామంది దగ్గరికి వెళ్లేందుకు భయపడ్డారు. సమీపంలోని ఓ దుకాణదారుడి సమాచారంతో 'ఆసరా ఫౌండేషన్' సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారు వచ్చేసరికే ఎండ నుంచి తప్పించుకునేందుకు కొన్ని కుక్కలు సమీప అడవిలోకి పారిపోగా, మరికొన్నింటిని వాహనదారులు తీసుకెళ్లారు. అక్కడ అస్వస్థతతో పడి ఉన్న 8 శునకాలను వలంటీర్లు రక్షించారు. ప్రస్తుతం వాటిని 'స్వాన్ ఎన్జీవో' సంరక్షణ కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అసలు ఇంత పెద్ద సంఖ్యలో ఖరీదైన శునకాలను ఎందుకు వదిలివెళ్లారనేది మిస్టరీగా మారింది. అక్రమ బ్రీడింగ్ కేంద్రాల నిర్వాహకులు అధికారుల తనిఖీల భయంతో వదిలించుకున్నారా? లేక వాటికి ఏమైనా అనారోగ్యం సోకిందా? అనే కోణాల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయకృష్ణ తెలిపారు. మిగిలిన శునకాల ఆచూకీ కోసం వలంటీర్లు గాలిస్తున్నారు. అవి ఎక్కడైనా కనిపిస్తే వెంటనే 9949872527 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని జంతు పరిరక్షణ సంస్థ ప్రతినిధులు ప్రజలను కోరారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# పెన్షన్ ఏకంగా 7.5 రెట్లు పెరగనుందా!





ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఖాతాదారులకు , పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం త్వరలో ఒక తీపి కబురు అందించబోతోంది. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కనీస పెన్షన్ పెంపు అంశంపై ఇప్పుడు తీవ్రంగా చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ కింద అందుతున్న కనీస పెన్షన్ రూ. 1,000 నుండి ఏకంగా రూ. 7,500 వరకు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది.చాలా కాలంగా కార్మిక సంఘాలు ఈ కనీస పెన్షన్‌ను పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. దీనికి సంబంధించి పార్లమెంటరీ కమిటీ కూడా సానుకూల సిఫార్సులు చేసింది. ప్రభుత్వం ఈ ప్రతిపాదనను సీరియస్‌గా తీసుకుంటే, పెన్షనర్ల ఆదాయం 7.5 రెట్లు పెరుగుతుంది. దీనివల్ల దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది వృద్ధ పెన్షనర్లకు ఆర్థికంగా పెద్ద ఊరట లభిస్తుంది.పెన్షన్ పెంపుతో పాటు, జూశీూ మరో సంచలన మార్పుకు సిద్ధమవుతోంది. ఇకపై పీఎఫ్ డబ్బులు తీసుకోవడం మరింత సులభతరం కానుంది. త్వరలోనే ఏటీఎంల ద్వారా పీఎఫ్ విత్‌డ్రా చేసుకునే సౌకర్యాన్ని తీసుకురావాలని అధికారులు ప్లాన్ చేస్తున్నారు. దీనివల్ల అత్యవసర సమయంలో డబ్బు కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన అవసరం ఉండదు. అలాగే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 8.25% వడ్డీ రేటును కూడా ప్రభుత్వం త్వరలో ఖరారు చేసే అవకాశం ఉంది.గతంలో పీఎఫ్ డబ్బులు రావాలంటే నెలల తరబడి సమయం పట్టేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 8.31 కోట్ల క్లెయిమ్‌లను పరిష్కరించి రికార్డు సృష్టించింది. ఇందులో విశేషమేమిటంటే.. దాదాపు 71 శాతం అడ్వాన్స్ క్లెయిమ్‌లు కేవలం మూడు రోజుల్లోనే సెటిల్ అయ్యాయి. ఆటోమేషన్ ప్రక్రియను పెంచడం వల్లే ఇది సాధ్యమైందని అధికారులు చెబుతున్నారు.చాలా మందికి పాత కంపెనీల్లో పీఎఫ్ అకౌంట్లు ఉండిపోయి, వాటి వివరాలు తెలియక ఇబ్బంది పడుతుంటారు. అలాంటి వారి కోసం అనే కొత్త పోర్టల్‌ను లాంచ్ చేసింది. మీ పాత ఇన్ యాక్టివ్ అకౌంట్లను ఆధార్ ద్వారా లింక్ చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. అలాగే బ్యాంక్ అకౌంట్లను లింక్ చేయడానికి ఇప్పుడు యజమాని పర్మిషన్ కూడా అవసరం లేదు, మీరు నేరుగానే అప్‌డేట్ చేసుకోవచ్చు.మొత్తానికి కనీస పెన్షన్ పెంపుపై అధికారిక ప్రకటన వస్తే మాత్రం మధ్యతరగతి ఉద్యోగులకు , పెన్షనర్లకు అంతకంటే పెద్ద వార్త మరొకటి ఉండదు. డిజిటల్ సేవలు పెరుగుతుండటంతో పీఎఫ్ సేవలు ఇప్పుడు సామాన్యులకు మరింత చేరువయ్యాయి.

# బజాజ్ ఫైనాన్స్ గుడ్ న్యూస్ - మీ పొదుపుపై ఇక భారీ రాబడి

మెరుగైన రాబడుల కోసం చూస్తున్న ఇన్వెస్టర్లకు బజాజ్ ఫైనాన్స్ గుడ్ న్యూస్ చెప్పింది. మే 1 నుంచి అమల్లోకి వచ్చేలా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కంపెనీలోకి కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ మార్పులు చేసింది. ప్రధాన బ్యాంకులు తమ వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచుతున్న తరుణంలో, బజాజ్ ఫైనాన్స్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. తమ ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా ఈ పెరిగిన వడ్డీ రేట్లు సరిపోతాయో లేదో ఇన్వెస్టర్లు ఇప్పుడు నిర్ణయించుకోవాల్సి ఉంటుంది.కొత్త రేట్ల ప్రకారం, కొన్ని ప్రత్యేక కాలపరిమితులపై గరిష్టంగా 7.40 శాతం వడ్డీ లభిస్తుంది. ముఖ్యంగా 33 నెలలు మరియు 44 నెలల కాలపరిమితి గల డిపాజిట్లపై సాధారణ ప్లాన్ల కంటే ఎక్కువ లాభం ఉంటుంది. సీనియర్ సిటిజన్లకు ఎప్పటిలాగే అదనంగా 0.25 శాతం (25 బేసిస్ పాయింట్లు) వడ్డీ లభిస్తుంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని తట్టుకుని, రిటైర్డ్ వ్యక్తులు తమ పొదుపుపై మంచి రాబడి పొందేందుకు ఇది దోహదపడుతుంది.సాధారణ కస్టమర్ల కోసం బజాజ్ ఫైనాన్స్ ఎందుకు వడ్డీ రేట్లు పెంచింది.ప్రస్తుతం మార్కెట్ పరిస్థితులు ఇన్వెస్టర్లకు కాస్త సవాలుగానే ఉన్నాయని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. చాలా పెద్ద కమర్షియల్ బ్యాంకులు 7 నుంచి 7.2 శాతం వడ్డీని మాత్రమే ఆఫర్ చేస్తున్నాయి. ఈ క్రమంలో బజాజ్ ఫైనాన్స్ మరింత ఆకర్షణీయమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది. సాధారణ బ్యాంక్ డిపాజిట్లతో పోలిస్తే ఎన్‌బీఎఫ్‌సీల్లో రిస్క్ కొంచెం ఎక్కువగా ఉన్నప్పటికీ, బజాజ్ ఫైనాన్స్‌కు ఉన్న హై క్రెడిట్ రేటింగ్స్ ఇన్వెస్టర్లకు భరోసానిస్తున్నాయి.స్మార్ట్ ఇన్వెస్టర్లు ఎప్పుడూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులతో రేట్లను పోల్చి చూస్తుంటారు. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు అధిక రాబడి కోరుకునే వారి కోసం 8 శాతానికి పైగా వడ్డీని ఇస్తుంటాయి. అయితే, బజాజ్ ఫైనాన్స్ భద్రత మరియు అధిక రాబడి మధ్య సమతుల్యతను పాటిస్తోంది. వివిధ కాలపరిమితులకు సంబంధించి కొత్త వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయో కింద ఉన్న టేబుల్‌లో చూడవచ్చు. ఇప్పుడే డబ్బును డిపాజిట్ చేయడం ఎందుకు లాభదాయకమో ఇది స్పష్టం చేస్తుంది. ఇప్పుడే డబ్బును లాక్ చేయాలా అని చాలామంది ఆలోచిస్తుంటారు. రాబోయే నెలల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన వైఖరిని మార్చుకోవచ్చు. భవిష్యత్తులో వడ్డీ రేట్లు ఇంకా పెరుగుతాయేమోనని ఎఫ్‌డీ ఇన్వెస్టర్లు ఆశపడటం సహజం. అయితే, ప్రస్తుతం లభిస్తున్న 7.40 శాతం వడ్డీ రేటును ఇప్పుడే ఖరారు చేసుకోవడం వల్ల స్థిరమైన ఆదాయం లభిస్తుంది. ముఖ్యంగా నెలవారీ ఖర్చుల కోసం వడ్డీపై ఆధారపడే వారికి ఇది మంచి అవకాశం.ఎన్‌బీఎఫ్‌సీ డిపాజిట్లు సాధారణ సేవింగ్స్ ఖాతాల కంటే భిన్నంగా ఉంటాయి. బ్యాంకుల్లో ఉండే రూ. 5 లక్షల ఇన్సూరెన్స్ వీటికి వర్తించదు. కానీ, బజాజ్ ఫైనాన్స్ వంటి అగ్రశ్రేణి సంస్థలకు సకాలంలో చెల్లింపులు చేసే బలమైన ట్రాక్ రికార్డ్ ఉంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా సులభంగా అకౌంట్ ఓపెన్ చేసే సదుపాయం ఉండటంతో యువ ఇన్వెస్టర్లు కూడా వీటి వైపు మొగ్గు చూపుతున్నారు.ఈ కొత్త వడ్డీ రేట్ల వల్ల సీనియర్ సిటిజన్లకు అత్యధిక ప్రయోజనం చేకూరుతుంది. 7.65 శాతం వడ్డీ రేటు రిటైర్డ్ వ్యక్తులకు చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. వైద్య ఖర్చులు, రోజువారీ అవసరాలకు ఈ అదనపు ఆదాయం ఎంతో తోడ్పడుతుంది. స్టాక్ మార్కెట్ రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడని వృద్ధులు ఇలాంటి సురక్షితమైన డిపాజిట్లను ఎంచుకుంటారు. ఇందులో నెలవారీ లేదా త్రైమాసిక వడ్డీని పొందే వెసులుబాటు కూడా ఉంది.దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం సామాన్యుల పొదుపుపై ప్రభావం చూపుతోంది. సాధారణ సేవింగ్స్ ఖాతాలో డబ్బు ఉంచడం వల్ల దాని విలువ తగ్గే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో అధిక వడ్డీ ఇచ్చే ఫిక్స్‌డ్ డిపాజిట్లు రక్షణ కవచంలా పనిచేస్తాయి. నేడే మంచి వడ్డీ రేటును లాక్ చేసుకోవడం ద్వారా మీ సంపదను వేగంగా పెంచుకోవచ్చు. సురక్షితమైన మరియు అధిక రాబడి ఇచ్చే పథకాల్లో పెట్టుబడి పెట్టాలని ఆర్థిక నిపుణులు సూచిస్తుంటారు.బజాజ్ ఫైనాన్స్ తాజా నిర్ణయం రిటైల్ ఇన్వెస్టర్లకు ఒక గొప్ప అవకాశం. మార్కెట్ ఒడిదుడుకులతో సంబంధం లేకుండా మెరుగైన రాబడిని ఇది అందిస్తుంది. కొత్త ఇన్వెస్టర్లు తక్కువ మొత్తంతో కూడా తమ పెట్టుబడిని ప్రారంభించవచ్చు. వడ్డీ రేట్లు గరిష్ట స్థాయికి చేరుకున్న ఈ సమయంలో, ఇవి ఇన్వెస్టర్లకు ఒక సేఫ్టీ నెట్‌లా పనిచేస్తాయి. అయితే, దీర్ఘకాలిక డిపాజిట్లు చేసే ముందు మీ నగదు అవసరాలను ఒకసారి బేరీజు వేసుకోవడం మంచిది.

# స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు అలర్ట్! మే నెలలో మార్కెట్ మూత పడే రోజులివే




మీరు రెగ్యులర్‌గా షేర్ మార్కెట్‌లో ట్రేడింగ్ చేస్తున్నారా అయితే మీకు ఒక ముఖ్యమైన అప్‌డేట్. మే 1వ తేదీన భారతీయ స్టాక్ మార్కెట్ పని చేయదు. అవును, మీరు విన్నది నిజమే! మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా మన దేశంలోని ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజీలు అయిన దీూజు (బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్),(నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్) రెండూ మూసివేసి ఉంటాయి. చాలా మందికి ఒక సందేహం ఉంటుంది. కేవలం షేర్ల కొనుగోలు, అమ్మకాలు మాత్రమే ఆగుతాయా అని. కానీ, మే 1న ఈక్విటీ సెగ్మెంట్ మాత్రమే కాదు, డెరివేటివ్స్, కరెన్సీ డెరివేటివ్స్, సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ బారోయింగ్, ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్ వంటి అన్ని విభాగాల్లోనూ ట్రేడింగ్ పూర్తిగా నిలిచిపోతుంది. అంటే ఆ రోజు మీరు ఎలాంటి ఆర్డర్లు ప్లేస్ చేయలేరు.కమోడిటీ మార్కెట్‌లో ట్రేడింగ్ చేసే వారికి కొంత ఊరట ఉంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఉదయం సెషన్‌లో (ఉదయం 9 నుండి సాయంత్రం 5 వరకు) మూసి ఉంటుంది. అయితే, సాయంత్రం సెషన్‌లో మాత్రం ట్రేడింగ్ మళ్ళీ మొదలవుతుంది. అంటే రాత్రి 5:00 గంటల నుండి 11:30 గంటల వరకు మీరు యధావిధిగా ట్రేడింగ్ చేసుకోవచ్చు.మే నెలలో కేవలం మే 1 మాత్రమే కాకుండా, మే 28న 'బక్రీద్' (ఈద్-ఉల్-అధా) సందర్భంగా కూడా స్టాక్ మార్కెట్ కు సెలవు ప్రకటించారు. కాబట్టి మే నెలలో ట్రేడర్లకు రెండు అదనపు సెలవులు దొరుకుతున్నాయన్నమాట. ఈ లోపు మార్కెట్ ఒడిదుడుకులను గమనిస్తూ మీ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ సిద్ధం చేసుకోండి.మే 2026 నెలలో ట్రేడింగ్ చేసేవారికి పండుగ సెలవులతో పాటు వారాంతపు సెలవులు కూడా కలిసి వస్తున్నాయి. అయితే పండుగ సెలవు రోజుల్లో అంటే మే 1వ తేదీ శుక్రవారంతోపాటు మే 28వ తేదీ గురువారం రోజున ఈక్విటీ, డెరివేటివ్స్ , సెక్యూరిటీస్ లెండింగ్ వంటి అన్ని విభాగాల్లో లావాదేవీలు నిలిచిపోతాయి.అయితే, కమోడిటీ మార్కెట్ ట్రేడర్లు మాత్రం ఒక విషయం గమనించాలి; మే 1న ఉదయం సెషన్ మాత్రమే సెలవు ఉంటుంది, సాయంత్రం సెషన్‌లో ట్రేడింగ్ యధావిధిగా కొనసాగుతుంది. ఇక సాధారణంగా వచ్చే శని, ఆదివారాలు (మే 2, 3, 9, 10, 16, 17, 23, 24, 30, 31) కలుపుకుని ఈ నెలలో మొత్తం 12 రోజులు మార్కెట్ పనిచేయదు. మే నెల తర్వాత మళ్ళీ జూన్ 26వ తేదీన మొహర్రం సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజీలకు సెలవు ఉంటుంది. కాబట్టి ఇన్వెస్టర్లు ఈ తేదీలను బట్టి తమ ట్రేడింగ్ ప్లాన్ సిద్ధం చేసుకోవడం మంచిది.

# హైదరాబాద్ మెట్రో ఇక ప్రభుత్వానిదే



హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా తన చేతుల్లోకి తీసుకుంది. దీంతో ఎల్ అండ్ టీ (ూ&ు) సంస్థతో ఉన్న సుదీర్ఘ భాగస్వామ్యం ముగిసింది. నగరవాసులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇకపై రైళ్ల సంఖ్య పెరగడంతో పాటు టికెట్ ధరలు కూడా తగ్గుతాయని ప్రయాణికులు ఆశిస్తున్నారు. భాగ్యనగర ప్రజా రవాణా వ్యవస్థలో ఇది ఒక కీలక మలుపు.మెట్రో కార్యకలాపాలు, భవిష్యత్తు ప్రణాళికలపై ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికే పూర్తి నియంత్రణ ఉంటుంది. ప్రైవేట్ భాగస్వామి ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను పరిష్కరించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. కొత్త మెట్రో లైన్ల పనులు వేగవంతం కావడంతో పాటు మెరుగైన రూట్లు అందుబాటులోకి వస్తాయని ప్రజలు భావిస్తున్నారు. ప్రభుత్వమే నేరుగా పర్యవేక్షించడం వల్ల సామాన్యుల అవసరాలకు ప్రాధాన్యత లభిస్తుంది. ముఖ్యంగా ఆఫీసులకు వెళ్లేవారి ఇబ్బందులు తొలగడంతో పాటు శివారు ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతుంది.మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో టికెట్ ధరల తగ్గింపుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. సామాన్యులకు ఊరటనిచ్చేలా ప్రభుత్వం త్వరలోనే చార్జీలను తగ్గించే అవకాశం ఉంది. గతంలో ప్రైవేట్ నిర్వహణలో ధరలు ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు అసంతృప్తిగా ఉండేవారు. కొత్త ధరల విధానం అమల్లోకి వస్తే విద్యార్థులు, ఉద్యోగులకు భారీగా డబ్బు ఆదా అవుతుంది. రోడ్లపై ట్రాఫిక్ తగ్గించి, ఎక్కువ మంది మెట్రోను వాడేలా చేయడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. తక్కువ ధరలు అందుబాటులోకి వస్తే మెట్రో ప్రయాణికుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతుంది.ప్రభుత్వ నిర్ణయంతో మెట్రో రెండో దశ (ఫ్తుుంవ 2) విస్తరణ పనులు వేగవంతం కానున్నాయి. ముఖ్యంగా ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీపై ప్రభుత్వం దృష్టి సారించింది. దీనివల్ల దూర ప్రాంతాల్లో ఉండేవారికి ప్రయాణ సమయం భారీగా తగ్గుతుంది. పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా మెట్రో నెట్‌వర్క్‌ను పెంచడం ఇప్పుడు అనివార్యం. కొత్త లైన్లు అందుబాటులోకి వస్తే కాలుష్యం తగ్గడమే కాకుండా ట్రాఫిక్ కష్టాలు కూడా తీరుతాయి. మెరుగైన రైలు అనుసంధానం హైదరాబాద్‌ను నివసించడానికి మరింత అనువైన నగరంగా మారుస్తుంది.కొత్త మెట్రో టీమ్ ప్రధాన లక్ష్యం ఎయిర్‌పోర్ట్ లింక్ ప్రాజెక్టును పూర్తి చేయడం. ప్రధాన వ్యాపార కేంద్రాల నుంచి విమానాశ్రయానికి నేరుగా కనెక్టివిటీ ఏర్పడనుంది. మెట్రో స్టేషన్ల సమీపంలో రియల్ ఎస్టేట్ ధరలు పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే చాలా మంది స్టేషన్ల పరిసరాల్లో భూములు కొనుగోలు చేస్తున్నారు. మెరుగైన రవాణా సౌకర్యాలు ఎప్పుడూ స్థానిక ఇళ్లు, ఆఫీసుల విలువను పెంచుతాయి. ఈ ధోరణి స్థానిక ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయనుంది.కరోనా మహమ్మారి తర్వాత ఎల్ అండ్ టీ సంస్థ భారీ నష్టాలను చవిచూసింది. అప్పుల భారం పెరగడంతో మెట్రో నిర్వహణ వారికి కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో మెట్రోను ఒక బలమైన ప్రజా ఆస్తిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ నిర్ణయం ప్రతిరోజూ మెట్రోలో ప్రయాణించే వారికి భరోసానిస్తుంది. ప్రభుత్వ నిధులతో మెట్రో వ్యవస్థకు స్థిరత్వం లభిస్తుంది. ప్రభుత్వ యాజమాన్యంలో ఉండటం వల్ల కీలక ప్రాజెక్టుల్లో దీర్ఘకాలిక పెట్టుబడులకు ఆస్కారం ఉంటుంది. ప్రయాణికుల అనుభూతిని మెరుగుపరిచేందుకు మరిన్ని కొత్త ఫీచర్లను జోడించాలని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే అదనపు కోచ్‌లు, స్టేషన్లలో మెరుగైన వసతులు కల్పించనున్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారు. మెట్రోను బస్సులతో అనుసంధానించడం ద్వారా ప్రయాణం మరింత సులభతరం కానుంది. హైదరాబాద్‌ను ఒక గ్లోబల్ సిటీగా మార్చే క్రమంలో అత్యాధునిక సాంకేతికతతో మెట్రోను మరింత సురక్షితంగా తీర్చిదిద్దనున్నారు.ప్రభుత్వ పర్యవేక్షణలో హైదరాబాద్ మెట్రో భవిష్యత్తు ఆశాజనకంగా కనిపిస్తోంది. నిధుల విడుదల, అనుమతులు వేగంగా లభించడం వల్ల మెట్రో నెట్‌వర్క్ శరవేగంగా విస్తరిస్తుంది. తక్కువ ధరకే ప్రయాణం, నగరంలోని ప్రతి మూలకు మెట్రో సౌకర్యం కలగాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం నగరాభివృద్ధికి బాటలు వేయడమే కాకుండా రాబోయే తరాలకు ఎంతో మేలు చేస్తుంది.

# 2025 సంవత్సరానికి ఎలాన్ మస్క్ వేతన ప్యాకేజీ రూ.15 లక్షల కోట్లు

**158 బిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీగా రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొన్న కంపెనీ**

**పనితీరు విషయంలో లక్ష్యాలను నెరవేరితేనే మస్క్‌కు మొత్తం అందుతుంది**

**టెస్లా బోర్డు ఆమోదిస్తే 26 బిలియన్ డాలర్లు**



టెస్లా ఇంక్ అధినేత ఎలాన్ మస్క్ 2025 ఆర్థిక సంవత్సరానికి గాను 158 బిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీని పొందారు. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఆయన ప్యాకేజీని కంపెనీ పేర్కొంది. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.15 లక్షల కోట్లు. ఎలాన్ మస్క్ నెలవారీ వేతనంగా ఎలాంటి మొత్తాన్ని పొందడం లేదు. స్టాక్ అవార్డులు, ఇతరత్రా రూపంలో పారితోషిక ప్యాకేజీని అందుకుంటారు. ఈ క్రమంలో గత సంవత్సరానికి గాను ఆయన ప్యాకేజీని టెస్లా ప్రకటించింది.అయితే ప్రకటించిన మొత్తంతో పోలిస్తే ఆయన పొందే విలువలొ చాలా వ్యత్యాసం ఉంటుందని కూడా టెస్లా తన ఫైలింగ్‌లో తెలిపింది. కంపెనీ పనితీరు ఆధారిత పారితోషికం విలువ 132 బిలియన్ డాలర్లుగా ఉంది. పనితీరు విషయంలో కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరితేనే ఈ మొత్తం మస్క్‌కు అందుతుంది. అలాగే ప్యాకేజీలో మిగతా 26 బిలియన్ డాలర్లు కూడా టెస్లా బోర్డు ఆమోదిస్తేనే అందుతుంది.

## వాణిజ్య గ్యాస్‌పై భారీ వాత..

# సిలిండర్‌పై రూ.993 పెంపు

**ఢిల్లీలో రూ.3,071కి చేరిన 19 కేజీల సిలిండర్ ధర**

**గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరల్లో లేని మార్పు**

**హోటళ్లు, రెస్టారెంట్లపై గణనీయంగా పెరగనున్న నిర్వహణ వ్యయం**

**అంతర్జాతీయ పరిణామాలే ధరల పెంపునకు కారణం**



వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. 19 కేజీల కమర్షియల్ సిలిండర్‌పై చమురు మార్కెటింగ్ సంస్థలు (ూవీజం) ఏకంగా రూ.993 మేర పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ఈ ధరలు నేటి నుంచి (మే 1) 2026 అమల్లోకి వచ్చాయి. అయితే, గృహ వినియోగదారులకు ఊరట కల్పిస్తూ 14.2 కేజీల డొమెస్టిక్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు.పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులు, అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరగడమే ఈ పెంపునకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ తాజా పెంపుతో ఢిల్లీలో 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధర రూ.3,071.50కి చేరింది. భారత్ తన ఎల్పీజీ అవసరాల్లో సుమారు 60 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ ధరల ప్రభావం అధికంగా ఉంటోంది.ఈ ధరల పెంపుతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వాణిజ్య సంస్థలపై నిర్వహణ భారం మరింత పెరగనుంది. పెరిగిన ఈ భారాన్ని వ్యాపారులు వినియోగదారులకు బదిలీ చేసే అవకాశం ఉందని, ఫలితంగా బయట ఆహార పదార్థాల ధరలు పెరగొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి నుంచి వాణిజ్య సిలిండర్‌పై ధర పెరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం.మరోవైపు, అంతర్జాతీయంగా ఒత్తిడి ఉన్నప్పటికీ సామాన్యులకు ఉపశమనం కల్పిస్తూ గృహ వినియోగ ఎల్పీజీతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలను కూడా కేంద్రం యథాతథంగా ఉంచింది. విమానయాన ఇంధనం (ూుఖీ) ధరల్లో కూడా మార్పు చేయలేదు. చమురు సంస్థలు ప్రతి నెలా ఒకటో తేదీన ధరలను సమీక్షిస్తుంటాయి. తదుపరి సమీక్ష జూన్ 1న జరగనుంది.

# స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు,



భారత్‌లో బంగారం, వెండి ధరలు ఏప్రిల్ 30, ఉదయం ట్రేడింగ్‌లో ఒడిదొడుకులతో సాగుతున్నాయి.బంగారం ధర స్వల్పంగా పెరిగినప్పటికీ, రూ. 1.50 లక్షల మార్కు కంటే తక్కువగానే ట్రేడ్ అవుతోంది. మరోవైపు, వెండి ధర రూ. 1,300కు పైగా పెరిగి, దాదాపు రూ. 2,34,500 వద్ద ట్రేడ్ అవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఇదే ధోరణి కనిపిస్తోంది. స్పాట్ గోల్డ్ 0.2% పెరిగి సుమారు వి4,550 వద్ద ఉండగా, స్పాట్ సిల్వర్ 1% లాభపడి ఔన్సుకు వి72 సమీపంలో ఉంది.అయితే, ముడి చమురు ధరలు పెరగడం వల్ల బంగారం లాభాలు పరిమితంగా ఉన్నాయి. యూఎస్ డబ్ల్యూటీఐ క్రూడ్ ఆయిల్ 2.4% పెరిగి బ్యారెల్‌కు వి109.5 సమీపంలో ట్రేడ్ అవుతుండగా, బ్రెంట్ క్రూడ్ ఆయిల్ దాదాపు 3% ఎగబాకి బ్యారెల్‌కు వి114 వద్ద ఉంది. అదే సమయంలో, యూఎస్ డాలర్ ఇండెక్స్ కూడా 99 మార్కు వద్ద కదలాడుతోంది.తీవ్రమవుతున్న ఇంధన సంక్షోభం కారణంగా ద్రవ్యోల్బణం భయాలు పెరిగాయి. దీంతో 2026లో సెంట్రల్ బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గిస్తాయన్న ఆశలు దూరమవుతున్నాయి. ఈ కారణంతోనే జూవీజుశలో బంగారం ధర నెల రోజుల కనిష్టానికి దగ్గరగా ఉంది.ఇరాన్ అణు ఒప్పందానికి అంగీకరించే వరకు ఆ దేశంపై నావికా దిగ్బంధనాన్ని కొనసాగిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. అయితే, ఆర్థిక ఒత్తిడి, అంతర్గత విభేదాల ద్వారా తమ దేశాన్ని లొంగదీసుకోవడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారని టెహ్రాన్ ఆరోపించింది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఈ వివాదం, స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ దాదాపు మూసివేతకు గురవడం వంటి పరిణామాలు ప్రపంచ మార్కెట్లను అనిశ్చితికి గురిచేశాయి. ట్రేడింగ్ ఎకనామిక్స్ ప్రకారం, ఈ పరిణామాలతో ట్రేడర్లు ఈ ఏడాది వడ్డీ రేట్ల కోతపై అంచనాలను తగ్గించుకున్నారు. దానికి బదులుగా, 2027 నాటికి వడ్డీ రేట్ల పెంపు ఉండొచ్చనే అవకాశాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు.యూఎస్ ఫెడరల్ రిజర్వ్ తాజా పాలసీ నిర్ణయాలు కూడా కమోడిటీ మార్కెట్ ట్రెండ్‌పై ప్రభావం చూపుతున్నాయి. ఏప్రిల్ 29న, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లను వరుసగా ఐదోసారి యథాతథంగా 3.5% - 3.75% వద్ద ఉంచింది. అయితే, ఏప్రిల్ 29 నాటి సమావేశంలో ఖీూవీజ కమిటీలో 8-4 ఓట్ల తేడాతో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. 1992 తర్వాత ఈ స్థాయిలో వ్యతిరేకత రావడం ఇదే తొలిసారి. ఇదే జెరోమ్ పావెల్‌కు చివరి పాలసీ సమావేశం అవుతుందని చాలా మంది భావించినప్పటికీ, తాను ఫెడ్ బోర్డులో గవర్నర్‌గా కొనసాగుతానని ఆయన ప్రకటించారు.

## దృశ్యం 3 తెలుగు వెర్షన్‌పై డైరెక్టర్ జీతూజోసెఫ్ గుడ్‌న్యూస్..!

మాలీవుడ్ నుంచి రిలీజై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచిన ఫ్రాంచైజీల్లో టాప్‌లో ఉంటుంది దృశ్యం జీతూ జోసెఫ్ దర్శకత్వం వహించిన ఈ ఫ్రాంచైజీ క్రైం థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కగా.. సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలతో ప్రేక్షకులను సీట్లకు కట్టిపడేస్తుంది. ఇప్పుడు ఈ ఫ్రాంచైజీలోమరోసారి దృశ్యం 3 కూడా వస్తుందని తెలిసిందే. దృశ్యం ఫస్ట్ పార్ట్ థియేటర్‌లో విడుదలవగా.. రెండో పార్టు ఓటీటీలో విడుదలైంది. రెండు పార్టులను తెరకెక్కించిన ఆశీర్వాద్ సినిమాస్ దశ్యం 3ని కూడా తెరకెక్కిస్తోంది. మలయాళంలో మోహన్ లాల్ , మీనా కాంబోలో వస్తోన్న దృశ్యం 3 మే 21న గ్రాండ్‌గా విడుదల కానుంది. తెలుగులో వెంకటేశ్, మీనా కాంబోలో రావాల్సిన దృశ్యం 3 సినిమా వెంకీ బిజీ షెడ్యూల్స్ వల్ల తెరకెక్కించడం లేదని ఇప్పటికే వార్తలు వచ్చాయి. అయితే వెంకీ దృశ్యం 3 కోసం ఎదురుచూస్తున్న మూవీ లవర్స్‌కు నిరాశ మిగిలింది. వారి కోసం డైరెక్టర్ జీతూ జోసెఫ్ గుడ్‌న్యూస్ అందించాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో చిట్‌చాట్ సెషన్‌లో దృశ్యం 3 మలయాళ వెర్షన్‌తోపాటు మే 21నే తెలుగు, తమిళం, కన్నడ డబ్బింగ్ వెర్షన్లు కూడా విడుదలవుతాయని చెప్పాడు. మొత్తానికి తెలుగు రీమేక్ లేకున్నా డబ్‌డ్ వెర్షన్ వస్తుండటంతో కొంత రిలీఫ్ అవుతున్నారు మూవీ లవర్స్. కాగా హిందీలో అజయ్ దేవ్‌గన్, శ్రియా కాంబోలో దృశ్యం 3 కూడా తెరకెక్కుతుండగా.. ఈ మూవీని 2026 అక్టోబర్ 2న రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. అంటే ఒరిజినల్ (మలయాళం) వెర్సన్ రిలీజైన 6 నెలల తర్వాత హిందీలో రాబోతుందన్నమాట.




## ప్రముఖ నటి కూతురు.. ఫస్ట్ సినిమా పోస్టర్ విడుల

ప్రముఖ నటి వనితా విజయ్‌కుమార్ కూతురు జోవిక టాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తుంది. తాను నటిస్తున్న కొత్త సినిమా అగధ నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తాజాగా విడుదల చేశారు. స్టార్ కిడ్‌గా గుర్తింపు ఉన్న జోవిక తమిళ్ బిగ్ బాస్ సీజన్- 7లో కనిపించిన విషయం తెలిసిందే.. తమిళ్‌లో గతేడాది మిసెస్ ₹ మిస్టర్ మూవీతో అలరించిన జోవిక ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను పలకరించనుంది. ప్రముఖ నిర్మాత--దర్శకుడు ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో రానున్న చిత్రం అగధ.. మిస్టికల్ డివైన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ మూవీలో హరిణి పాత్రలో జోవిక కనిపించనుంది. ఈ చిత్రంలో హీరోయిన్ కామాక్షీ భాస్కర్ల ప్రధాన పాత్ర పోషించారు. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మించిన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో త్వరలో విడుదల కానుంది. ఈ మూవీలో మహాదేవి పాత్రలో నటించిన కామాక్షీ భాస్కర్ల లుక్‌ని కొద్దిరోజుల క్రితమే రివీల్ చేశారు. “డర్టీ హరి’ చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న శ్రవణ్ రెడ్డికి ఎం.ఎస్. రాజు. మరోసారి ‘అగధ’లో సింహ పాత్ర చేసే అవకాశం ఇచ్చారు. కథలోని దైవిక, ఆధ్యాత్మిక అంశాల చుట్టూ ఉన్న రహస్యాన్ని ఛేదించే పాత్రను సింహ పోషించారు. 85 రోజుల షూటింగ్... విస్తృతమైన సెట్ వర్క్... దాదాపు 45 నిమిషాల వీఎఫ్‌ఎక్స్‌తో ‘అగధ’ ప్రేక్షకులకు ప్రత్యేకమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందిస్తుంది” అని చిత్రయూనిట్ పేర్కొంది.






## ఓటీటీలోకి శర్వానంద్ ‘బైకర్’.. స్ట్రీమింగ్ ఎప్పటి నుంచంటే?

టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ నటించిన లేటెస్ట్ స్పోర్ట్స్ డ్రామా ‘బైకర్’ ఓటీటీలోకి రాబోతుంది. భారతదేశంలోనే మొట్టమొదటి మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ చిత్రం, థియేటర్లలో విడుదలైన నెల రోజుల్లోనే డిజిటల్ ప్రేక్షకులను పలకరించబోతోంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు దక్కించుకుంది. దీంతో ఈ చిత్రం మే 1 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది. ఇక హిందీలో ఈ సినిమాను ‘శర్వా’ అనే టైటిల్‌తో విడుదల చేస్తున్నారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో శర్వానంద్ సరసన మాళవిక నాయర్ కథానాయికగా నటించగా, సీనియర్ నటుడు రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించారు. ఒక ప్రొఫెషనల్ బైక్ రేసర్ తన కెరీర్‌లో ఎదుర్కొనే సవాళ్లు, తండ్రి ఆశయాల కోసం అతను చేసే పోరాటాన్ని ఈ సినిమాలో అద్భుతంగా చూపించారు. థియేటర్లలో మిశ్రమ స్పందన లభించినప్పటికీ, రేసింగ్ సీక్వెన్స్ మరియు టెక్నికల్ వాల్యూస్ పరంగా సినిమాకు మంచి ప్రశంసలు దక్కాయి.




## రితేష్ రాణా మార్క్ కామెడీ థ్రిల్లర్.. సత్య ‘జెట్లీ’ నుంచి కొత్త ట్రైలర్

మత్తు వదలరా పార్ట్ 1,2 చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కమెడియన్ సత్య హీరోగా, విలక్షణ దర్శకుడు రితేష్ రాణా తెరకెక్కించిన తాజా చిత్రం ‘జెట్లీ’. ఈ చిత్రం మే 01న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా కొత్త ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. అ ట్రైలర్ చూస్తుంటే కథను మొత్తం ట్రైలర్‌లోనే రివీల్ చేసినట్లు తెలుస్తుంది. సత్య తనదైన టైమింగ్ మరియు మేనరిజమ్స్‌తో పూర్తిస్థాయి హీరోగా మెప్పించబోతున్నాడు. మిస్ యూనివర్స్ ఇండియా 2024 రియా సింఘా ఈ సినిమాతో తెలుగు తెరకు పరిచయం అవుతుండగా, వెన్నెల కిషోర్, వైవా హర్ష మరియు అజయ్ వంటి హేమాహేమీలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై చెర్రీ నిర్మించిన ఈ చిత్రానికి కాలా భైరవ సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. సెన్సార్ నుంచి ఇప్పటికే ఖ/ూ సర్టిఫికెట్ అందుకున్న ఈ చిత్రం, సమ్మర్ కానుకగా మే 1, 2026న థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించడానికి సిద్ధమైంది. సత్య మార్క్ కామెడీ మరియు రితేష్ రాణా స్టైలిష్ టేకింగ్ కలగలిసిన ఈ సినిమాపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## కందుల సులోచనగా అనుపమ.. కొత్త మూవీ పోస్టర్ విడుదల

శర్వానంద్ భోగి సినిమా నుంచి అనుపమ పరమేశ్వరన్ ఫస్ట్ లుక్ తాజాగా విడుదల చేశారు. 1960 నేపథ్యంలో సాగే ఈ కథకు అనుగుణంగా ఆమె లుక్ ఉంది. ఇప్పటికే శర్వానంద్ లుక్‌ను కూడా మేకర్స్ షేర్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ‘నారీ నారీ నడుమ మురారి’, బైకర్ చిత్రాలతో జోరు మీదు ఉన్న శర్వా.. హ్యాట్రిక్‌పై కన్నేశాడు. భోగి సినిమాతో తప్పకుండా హిట్ కొట్టాలని ఆయన ఉన్నారు. ఈ మూవీని దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్నారు. భోగి మూవీలో కందుల సులోచన రాణి పాత్రలో అనుపమ కనిపించనుందని తాజాగా మేకర్స్ ప్రకటించారు. తాజాగా విడుదలైన పోస్టర్ అనుపమ తన సాధారణ ఇమేజ్‌కు భిన్నంగా ఉంది. బోల్డ్, డీగ్లామరైజ్డ్ పాత్రలో కనిపించడంతో ఈ లుక్ అందరి దృష్టిని ఆకర్షించింది. పోస్టర్‌తో పాటు చిత్ర యూనిట్ ఇలా ఒక క్యాప్షన్ కూడా చేర్చింది. “ప్రకృతి బిడ్డ... గంగా నిలయం... కందుల గర్వం... భోగికి ప్రాణం” అని అనుపమ గురించి వర్ణించారు. ఉత్తర తెలంగాణ – మహారాష్ట్ర ప్రాంతాలతో ముడిపడిన ఈ పీరియాడిక్ స్టోరీని పాన్ ఇండియా రేంజ్‌లో నిర్మిస్తున్నారు. ఇందులో డింపుల్ హయాతి, రోహిత్ పాఠక్ కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ‘భోగి’ చిత్రం ఆగష్టు 28, 2026న థియేటర్లలో విడుదల కానుంది.




The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.